




● జనపాతం



6

పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలోని గొట్టుముక్కల జలపాతానికి పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. చుట్టూ అడవి.. అక్కడక్కడ కొండలు.. వాటిపై నుంచి జాలువారుతున్న నీటిని చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయారు. జలపాతం కింద స్నానాలు చేస్తూ, బండలపై ప్రవహిస్తున్న నీటిలో జారుతూ సందడి చేశారు.

● కార్తీక వనం



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపానికి పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి వనభోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నదీ తీరంలోని అందాలను ఆస్వాదించారు. చిన్నారులు, యువత వివిధ ఆటలు, పాటలతో ఆనందంగా గడిపారు.

వెహికల్ డిపోలో డీజిల్ దొంగలు!

ఉపయోగించని, స్క్రాప్ శానిటేషన్ వాహనాలలో డీజిల్ నింపారట!

- దొంగ రికార్డులతో అడ్డంగా దొరికిన నాటి ఇంజనీరింగ్ అధికారులు
- నిగ్గుతేల్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్
- ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులపై చర్యలకు ఆదేశం

కార్పొరేషన్ వెహికల్ డిపోలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విభాగం నిగ్గు తేల్చింది. మూలనపెట్టిన వాహనాల సంగతి బయటకు రానీయకుండా, వాటికి డీజిల్ వినియోగించినట్టుగా లెక్కలు చూపి దోచుకున్న నగదు గుట్టును సాక్ష్యాధారాలతో సహా బయట పెట్టింది. వాహన డిపో కేంద్రంగా 2017లో జరిగిన అక్రమాలపై తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ప్రకారం ఇంటి దొంగలు అందినకాడికి కార్పొరేషన్ సొమ్మును అడ్డగోలుగా తినేశారన్నది వాస్తవమని స్పష్టమైంది. వెహికల్ డిపోలో నిర్వహిస్తున్న వాహనాలకు ఎలాంటి ఖాతాలు నిర్వహించటం లేదని, పనిచేయని వాహనాలు, స్క్రాప్ చేసిన వాహనాలకు కూడా ఆయిల్ వినియోగించినట్టుగా లక్షలాది రూపాయలను మింగేసిన ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులపై చర్యలకు ఆదేశించింది. వినియోగించని, స్క్రాప్‌కు పంపిన వాహనాల డ్రైవర్లు, క్లీనర్లను ఇతర పనులకు ఉపయోగించారన్న ఆరోపణలు కూడా విజిలెన్స్ నివేదికలో వెల్లడయ్యాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కార్పొరేషన్ వెహికల్ డిపోలో మొత్తం 152 వాహనాలు ఉన్నాయి. వీటిలో 105 వాహనాలు రన్నింగ్‌లో ఉన్నాయి. మరో 10 వాహనాలు రన్నింగ్‌లో లేవు. మరో 37 వాహనాలను స్క్రాప్ చేయటం జరిగింది. రన్నింగ్‌లో ఉన్న 105 వాహనాలలో 64 వాహనాలు వెహికల్ డిపో నియంత్రణలో ఉన్నాయి. ఈ వాహనాలను నడపటానికి 210 మంది డ్రైవర్లు, క్లీనర్ల సేవలను అప్పట్లో ఉపయోగించారు. వాహన డిపోకు అప్పట్లో వర్క్స్ డివిజన్ - 4 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) వెహికల్ డిపోకు కూడా ఇన్‌చార్జిగా ఉన్నారు. ఒక డిప్యూటీ ఇంజనీర్, ఒక అసిస్టెంట్ ఇంజనీర్ సహాయకులుగా ఉన్నారు. వెహికల్ డిపోలో నిర్వహిస్తున్న వాహనాలకు అధికారికంగా ఎలాంటి ఖాతాలు నిర్వహించకుండా ఆయిల్ దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలు వచ్చాయి. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' 'లెక్కేలేదు' అనే శీర్షికతో వెహికల్ డిపోలో జరుగుతున్న అక్రమాలపై ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగంలోకి దిగి వెహికల్ డిపోలో విచారణ చేపట్టింది. 2015 - 2017 మధ్య కాలంలో వెహికల్ డిపోలో జరిగిన వ్యవహారాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మిగతా 6లో..


కమిషనర్‌కు తాజాగా విచారణ రిపోర్టు

అప్పటి విచారణకు సంబంధించి తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వానికి, విజయవాడ మునిసిపల్ కమిషనర్‌కు తాజాగా రిపోర్టు ఇచ్చింది. ఈ రిపోర్టు మేరకు చూస్తే.. 2015 - 2017 మధ్య కాలంలో రికార్డుల పరిశీలన మేరకు వెలుగు చూసిన అంశాలను వెహికల్ డిపోలోని మెకానిక్‌లు, శానిటేషన్ వాహనాలకు ఆయిల్ కూపన్లు జారీ చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వెహికల్ డిపోలోని ఇంజనీరింగ్ అధికారులు, ఇతర సిబ్బందిని విచారించారు. కొంతమంది కాంట్రాక్టర్లను కూడా విచారించారు. వెహికల్ డిపోకు స్పేర్ పార్టులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లను కూడా అధికారులు విచారించారు. ఈ క్రమంలో వాహనాల ఖాతాల నిర్వహణకు సంబంధించి జరిగిన చీకటి వ్యవహారాలను విజిలెన్స్ బయట పెట్టింది.

భక్తజనకీలాద్రి



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తులు పరవశించిపోయారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అంతరాలయ దర్శనాలను ఈవో శీనానాయక్ రద్దు చేశారు. అన్ని వీఐపీ, సిఫార్సు దర్శనాలను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏఈవో గంగాధర్‌తో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. -(ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి)



గాజుల అలంకరణ

పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ దేవస్థానంలో కార్తీకమాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు మర్రిబోయిన గోపీబాబు ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని లక్ష గాజులతో శోభాయమానంగా అలంకరించారు. -(ఆంధ్రజ్యోతి-పెనుగంచిప్రోలు)

ఇక ప్రజా సేవలో ఆశా కిరణ్

రాధా-రంగా మిత్రమండలి బలోపేతంపై దృష్టి

- సోదరుడు రాధాతో కలిసి ప్రయాణం.. దారులు వేరైనా గమ్యం ఒకటేనని వ్యాఖ్య
- రాజకీయ ప్రవేశంపై కొన్నాళ్లు ఆగాల్సిందే!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వంగవీటి మోహన రంగా కుమార్తె ఆశా కిరణ్ తన రాజకీయ జీవితంపై అభిమానులు, శ్రేయోభిలాషులను సస్పెన్స్‌లో పెట్టారు. ప్రస్తుతానికి ప్రజాజీవితంలోకి అడుగు పెట్టానని.. ప్రజా సేవే పరమావధిగా ముందుకు వెళతానని స్పష్టతనిచ్చారు. రాజకీయ ప్రవేశానికి సంబంధించి మాత్రం ఇప్పుడే చెప్పలేనని.. రాధా-రంగ మిత్ర మండలి నాయకులతో చర్చించిన తర్వాత భవిష్యత్తులో ప్రకటిస్తానని చెప్పారు. సోదరుడు రాధా, తన దారులు వేరైనా గమ్యం ఒకటేనంటూ ఆసక్తికర వ్యాఖ్యలు కూడా చేశారు. ప్రజా జీవితంలోకి వచ్చిన తాను రాధా - రంగా మిత్రమండలి మధ్య ఉన్న గ్యాప్‌ను సరిచేసే అంశంపై దృష్టి సారించినట్టు చెప్పారు. ఇదే సందర్భంలో తాను కాపు సామాజిక వర్గానికే కాకుండా అన్ని వర్గాలకు ప్రతినిధిగా ఉంటానన్న సంకేతాన్ని కూడా ఇచ్చారు. నాన్న కులం, మతం ఎప్పుడూ మిగతా 6లో..

చెన్నుపాటి శ్రీను ప్రోత్సాహం!

వంగవీటి మోహనరంగా కుమార్తె ఆశా కిరణ్ ప్రజా జీవితంలోకి రావటం వెనుక రాధా - రంగా మిత్రమండలి వ్యవస్థాపకుడు చెన్నుపాటి శ్రీను ఉన్నట్టు సమాచారం. ప్రజా జీవితంలోకి రావాలన్న ఆకాంక్షను ఆశా కిరణ్ వ్యక్తం చేయటంతో ఆయన వెన్నుతట్టి ప్రోత్సహించినట్టు తెలిసింది. రాధా మిత్ర మండలిని వంగవీటి మోహన రంగా స్థాపించారు. రంగా చనిపోయిన తర్వాత రాధా - రంగా మిత్ర మండలిని చెన్నుపాటి శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. రాధా, రంగా అభిమానులు, శ్రేయోభిలాషులు మిత్రమండలి తరఫున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాధా - రంగ మిత్రమండలి నాయకులతో చర్చించిన తర్వాతే రాజకీయ రంగ ప్రవేశంపై ప్రకటన ఇస్తానని చెప్పటం ద్వారా చెన్నుపాటి శ్రీను తెర వెనుక కీలక పాత్ర పోషిస్తున్నారన్నది తెలుస్తోంది.

ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డోర్ పికప్ - డోర్ డెలివరీ పార్శిల్ స్కీమ్‌కు కాంట్రాక్టు సంస్థ మంగళం పాడింది. ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా బుక్ చేసుకునేవారు డోర్ పికప్, డెలివరీ ఆప్షన్ ఎంచుకున్నా సదరు సంస్థ ప్రతినిధులు వెళ్లడం లేదు. దీంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విధిలేక బస్‌స్టేషన్‌కు వచ్చి పార్శిల్ ఇచ్చి, తీసుకెళ్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

పికప్‌కు ప్యాకప్!



ఆర్టీసీ పార్శిల్ డోర్ డెలివరీకి గ్రహణం

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టు సంస్థ
- పార్శిల్ పికప్ చేసుకోవడానికి వెళ్లని ప్రతినిధులు
- విధిలేక బస్‌స్టేషన్‌కు వచ్చి ఇస్తున్న వినియోగదారులు
- డోర్ డెలివరీ చేయకుండా తాత్సారం
- పాయింట్‌కు వచ్చి పార్శిల్ తీసుకెళ్లాల్సిన దుస్థితి
- అధికారులకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో లాజిస్టిక్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు, వినియోగదారులకు మరింత చేరువ కావటానికి డోర్ పికప్- డోర్ డెలివరీ స్కీమ్‌ను అధికారులు ప్రవేశపెట్టారు. లాజిస్టిక్ పార్శిల్స్, కార్గో రవాణాకు సంబంధించిన నిర్వహణ కాంట్రాక్టును దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థకే డోర్ పికప్ - డోర్ డెలివరీని కూడా అప్పగించారు. దీనికి వినియోగదారుల నుంచి అదనంగా చార్జీ వసూలు చేస్తారు. వినియోగదారుల నుంచి ముక్కుపిండి చార్జీలు వసూలు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ డోర్ పికప్ చేయటం లేదని, డోర్ డెలివరీ అస్సలు చేయటం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీలో లాజిస్టిక్స్‌ను ప్రవేశ పెట్టిన అనతికాలంలోనే బహుళ ప్రజాదరణ పొందింది. ఆర్టీసీకి భారీ సంఖ్యలో బస్సులు ఉండటం.. దూర ప్రాంతాలకు సైతం అదే రోజున గంటల వ్యవధిలోనే పార్శిల్స్ రవాణా మిగతా 6లో..

కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం

ప్రస్తుతం లాజిస్టిక్స్ నిర్వహిస్తున్న సంస్థకే ఈ బాధ్యతలను అప్పగించారు. వాస్తవానికి ఈ కాంట్రాక్టు సంస్థ సాధారణ లాజిస్టిక్స్ విభాగాన్నే సరిగా నిర్వహించటం లేదు. మ్యాన్ పవర్‌ను తగినంతగా ఉపయోగించకపోవటం వల్ల.. బస్‌స్టేషన్ కార్గో బుకింగ్ పాయింట్‌కు వచ్చే వారు గంట, రెండు గంటలు వేచి చూడాల్సి వస్తోంది. సాధారణ నిర్వహణ బాధ్యతలనే సక్రమంగా నిర్వహించని సంస్థకు 'డోర్ పికప్ - డోర్ డెలివరీ' బాధ్యతలు అప్పగించటంతో సమస్య తలెత్తింది. డోర్ పికప్‌ను ప్రారంభంలో కొద్ది రోజులు ప్రవేశపెట్టిన కాంట్రాక్టు సంస్థ ఆ తర్వాత చేతులెత్తేసింది. సిబ్బందిని కుదించటంతో సాధారణ విధులు నిర్వహించటానికే కష్టమైపోతోంది. దీంతో డోర్ పికప్‌ను వదిలేశారు.



ఇంటి పన్నుల వసూళ్లలో కొండపల్లి మున్సిపాలిటీ స్టేట్ ఫస్ట్

ఇబ్రహీంపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లలో కొండపల్లి మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు కమిషనర్ బి.రమ్యకీర్తన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించిన ప్రజలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, మిగిలిన వారు సైతం డిమాండ్ నోటీస్ అందుకున్న వెంటనే పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్ను వసూళ్లకు కృషి చేసిన సిబ్బందికి ప్రత్యేక అభినందలు తెలిపారు.

దీనార్స్‌లో జీరో

అద్విక కేసులో దుబాయి ఖాతాలు తెరిపించిన పోలీసులు

- ఏ ఖాతాలోనూ కనిపించని నిల్వలు
- కొత్తగా రూ.30 కోట్ల ఆస్తుల గుర్తింపు
- వాటిలో రూ.15 కోట్ల ఆస్తుల జప్తు
- అవన్నీ హైదరాబాద్‌లోనే...



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ముసుగులో దాని ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులను పంపినట్టుగా భావిస్తున్న దీనార్ ఖాతాలను పోలీసులు ఆదివారం తెరిపించారు. కస్టడీ విచారణలో భాగంగా ఆదిత్యతో ఈ ఖాతాలను తెరిపించినట్టు తెలిసింది. అందులో పోలీసులకు ఎలాంటి నిల్వలు కనిపించలేదు. దుబాయిలో ఉన్న ఫారెక్స్ ట్రేడింగ్ కంపెనీలకు ఆదిత్య ఇక్కడి నుంచి డబ్బులను పంపాడని పోలీసులు ఇప్పటికే నిర్ధారించారు. వాటిలో కబానా ఒకటి. ఇది కాకుండా దీనార్ ఖాతాలను తెరిచినట్టు గుర్తించారు. వాటిని తెరిపించి చూడగా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. అద్విక మిగతా 6లో..

విజయ అభివృద్ధికి శ్రమించిన మండవ

- జానకి రామయ్య సంతాప సభలో పలువురు వక్తలు

సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌కు ఘన వీడ్కోలు

అలరించిన ఆకాశవాణి సంగీత సమ్మేళనం

6



జూపూడి వద్ద..



గొట్టుముక్కల వాటర్‌ఫాల్స్


జలజలా జనపాతం..

వనాల బాట పట్టిన జనం ● మంచు కురిసే వేళలో జలపాతాల ఒడిలో పర్యాటకుల సందడి

● సందర్శకులతో నిండిన గొట్టుముక్కల వాటర్‌ఫాల్స్ ● జూపూడి, కొండపల్లి ఖిల్లా రోడ్‌లోని జలపాతాలకూ పెరిగిన తాకిడి



పీతాకోకచిలుకల పార్కు



కొండపల్లి ఖిల్లాకు వెళ్లే దారిలో...

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/కంచికచర్ల: పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా జలపాతాల సోయగాలతో పర్యాటక కనువిందు చేస్తోంది. ఆదివారం వస్తే చాలు..! జిల్లా నలుమూలల నుంచేకాక బయట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనం జలపాతాల వీక్షణకు తరలి వస్తున్నారు. గొట్టుముక్కల జలపాతానికి పర్యాటకులు పెద్ద ఎత్తున పోటెత్తుతున్నారు. ఒకపక్క శీతాకాలం.. ఉదయం 9 గంటలైనా తెర మంచు వీడటం లేదు. కానీ పర్యాటకులు మాత్రం గొట్టుముక్కల వాటర్ ఫాల్స్ సందర్శకులు తెల్లవారుఝామున మంచులోనే ఇక్కడికి చేరుకుంటున్నారు. రాష్ట్రంలో సుదూర ప్రాంతాల్లో ఉన్న శ్రీశైలం, అరకు, మారేడుమల్లి వెళ్లలేని వారికి గొట్టుముక్కల వాటర్ ఫాల్స్ ఆ లోటును తీరుస్తుందనడంతో అతిశయోక్తి లేదు. దీంతో సందర్శకులు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్నారు. విజయవాడ నగరానికి అతి సమీపంలో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామ సమీపంలోని కొండపల్లి రిజర్వు ఫారెస్టులో ఈ గొట్టుముక్కల వాటర్ పాల్స్ అబ్బుర పరిచే రీతిలో ఉన్నాయి. దీన్నే పరిటాల వాటర్ పాల్స్ అనికూడా పిలుస్తుంటారు. నగరానికి 40 కిలోమీటర్ల దూరంలో ఇవి ఉన్నాయి. అంతేకాక ఈ వాటర్ పాల్స్ కింద మద్దులతల్లి ఆలయం ఉంది. ఆదివారం పెద్ద ఎత్తున సమీప గ్రామాల నుంచి భక్తులు వచ్చారు. ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఆపి చెక్ చేసిన తర్వాత వాటిలో మద్యం సీసాలు ఉంటే వెనక్కి పంపుతున్నారు. అలానే నాన్ వేజ్ వంటలు కూడా ఆలయ ప్రాంతంలో నిషేధించారు.

మరో రెండు వాటర్ ఫాల్స్:

ఇబ్రహీంపట్నం మండలం జూపూడి వద్ద డాక్టర్ ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు కట్ట వద్ద వాటర్ పాల్ ఉంది. అయితే అది సహజ సిద్ధమైనది కాదు. బూడిద చెరువు కట్టకు రక్షణ కోసం నిర్మించిన గోడకు ఒక గాడిలా ఏర్పాటు చేసిన రంధ్రం నుంచి బూడిద నీటితో కలిసి నీరు సుమారు 50 మీటర్ల ఎత్తులోని నుంచి కిందకు జాలువారుతూ వీక్షించేందుకు అందంగా కనిపిస్తుంటాయి. దాన్ని చూసేందుకు, ఆనీటి కింద స్నానం చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.

కార్తీకమాసం కావడంతో నగర ప్రజలు వన భోజనాలకు మూలపాడు నగరవనం బాట పట్టారు. సీతాకోకచిలుకల పార్క్‌లో నేరేడు వనం, వెదురు వనాల్లో కూర్చొని భోజనాలు చేశారు. కొందరు ట్రెక్కింగ్ చేశారు. మరో పక్క కొండపల్లి ఖిల్లాకు పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు.

బాగా ఎంజాయ్ చేశాం: హాసిని, విజయవాడ

నేను నా ఫ్రెండ్స్ వచ్చాం. నేచర్‌ను ఎంజాయ్ చేశాం. ముఖ్యంగా వాటర్ పాల్స్ ఎంతో ఆనందానిచ్చాయి. మళ్లీ మళ్లీ రావాలనేలా వాటర్ పాల్స్ ఉన్నాయి. వీలైతే మరోమారు మా ఫ్రెండ్స్ అందరం వస్తాం.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్, సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

సీఎం చంద్రబాబుకు బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా వినతి

విజయవాడ లీగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్‌లో దాదాపు 3400 మంది న్యాయవాదులు వృత్తిపైనే ఆధారపడి, చాలామంది అద్దె ఇళ్లల్లో ఉంటూ కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నారని, మీ ప్రభుత్వ హయాంలోనైనా ఇళ్లు లేని న్యాయవాదులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా, సీఎం చంద్రబాబుకు విన్నవించారు. భారత రాజ్యాంగం రూపొందించి 75 వసంతాలు అయినందున ఏపీ హైకోర్టు బార్ అధ్యక్షుడు మంగళగిరి సమీపంలోని సీకే కన్వెన్షన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా, బెజవాడ బార్ న్యాయ వాదులు అరిగెల శివ రాంప్రసాద్, జి.వరాహలక్ష్మి, పెండెం రాజ్యలక్ష్మి, గుంటూరు బార్ అధ్యక్షుడు వై.శివసుబ్రమణ్యం, ముద్దాడ సత్యనారాయణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌ని, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్‌ని, సీఎం చంద్రబాబుని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు



క్షీర విప్లవ సారథి ఆంధ్ర కురియన్ జానకిరామయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని, పాలకవర్గసభ్యులు

విజయ అభివృద్ధికి శ్రమించిన మండవ

» సంతాప సభలో పలువురు వక్తలు

గన్నవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయడంతో పాటు విజయ డైయిరీని అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన యోధుడు మండవ జానకి రామయ్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గన్నవరం ఎస్‌ఎం కన్వెన్షన్‌లో కృష్ణామిల్క్ యూనియన్ మాజీచైర్మన్ మండవ జానకిరామయ్య సంతాప సభ చైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆర్థిక ఒడిదుడుకులతో ఉన్న సంస్థను లాభాల బాటలోకి నడిపించిన ఘనత మండవకే దక్కుతుందన్నారు. జానకి రామయ్యను ఆంధ్ర కురియన్‌గా పిలిచేవారన్నారు. తొలుత మండవ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 'క్షీర విప్లవ సారథి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మాజీమంత్రి, మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వరరావు, సీబీఎన్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షుడు మానం బ్రహ్మయ్య, యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, మండవ వాసు, పాలకవర్గ సభ్యులు, కుటుంబసభ్యులు హాజరై నివాళులు అర్పించారు.



హరివిల్లు శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అభివృద్ధికి దోహదం.. హరివిల్లు ప్రాజెక్టులు

» ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటు ధరలో ఆధునిక సౌకర్యాలతో ఇళ్లను అందించాలనే హరివిల్లు సంస్థ ప్రయత్నం అభినందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం ఉయ్యూరు మండలం గండిగుంటలో హరివిల్లు సంస్థ నిర్మించనున్న గృహాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గండిగుంట ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని, హరివిల్లు గ్రీన్ విస్తారా వంటి ప్రాజెక్టులు అభివృద్ధికి మరింత దోహదం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ చైర్మన్ వేములపల్లి లక్ష్మణ్ చౌదరి మాట్లాడుతూ, హరివిల్లు గ్రూప్ నాణ్యత, విశ్వసనీయత, కస్టమర్ సంతృప్తిని ప్రాధాన్యంగా తీసుకొని ముందుకు సాగుతోందని తెలిపారు. త్వరలో మరిన్ని ప్రాజెక్టులు అందుబాటులోకి తెస్తామన్నారు. మునిసిపల్ చైర్మన్ వల్లభనేని నాని, సీఈవో జాస్తి ప్రసన్న పాల్గొన్నారు.

బిర్సా ముండా జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించడం ఆనందంగా ఉంది

● ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన నేత, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించటం ఆనందంగా ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని తెలుగులో ముద్రించిన డాక్టర్ మోహన్ భగత్ రాసిన భగవాన్ బి ర్సా ముండా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నేతలు, నేషనల్ కమిషన్ మాజీ మెంబర్ మాదిగాని గురునాథం బిర్సా ముండా చిత్రపటాన్ని ఎంపీ కేశినేని శివనాథ్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా చిరస్మరణీయుడన్నారు. జనజాతీయ గౌరవ దివస్ వల్ల బిర్సా ముండా లాంటి ఎంతో మంది గిరిజన వీరుల గాథలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. టీడీపీ సీనియర్ నేతలు వీ నరసింహా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా పాల్గొన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ దంపతులు

ఇంద్రకీలాద్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనకదుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచన మండపంలో అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం టెంపుల్ సూపరింటెండెంట్ చందు శ్రీను వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అలరించిన ఆకాశవాణి సంగీత సమ్మేళనం

విజయవాడ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన ఆకాశవాణి సంగీత సమ్మేళనం ఆద్యంతం అలరించింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో సభ ప్రారంభమైంది. విజయవాడ డిప్యూటీ పోలీసు కమిషనర్ కేజీవీ సరిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆకాశవాణి పూర్వ సంగీత విద్వాంసుడు, పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, పద్మశ్రీ దండమూడి సుమతి, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, ఆకాశవాణి, దూరదర్శన్ కార్యాలయం సిబ్బంది, సంగీత రసజ్ఞులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం కేజీవీ సరిత, పొడపాటి తేజస్వి, ఆకాశవాణి విజయవాడ కార్యాలయ అధిపతి ఎం సోమేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌మోహన్ మాట్లాడారు. తొలుత విదుషీ డాక్టర్ కొల్లూరు వందన గాత్ర కచేరీ సంగీత అభిమానులను ఎంతగానో ఆకట్టుకొంది. వీరికి సహకారంగా ఎం రమ్య-వయోలిన్, బీవీఎస్ దుర్గాప్రసాద్-మృదంగం, ఏ శంకర్-ఘటం వాద్య సహకారం అందించారు. విద్వాన్ మోదుమూడి సుధాకర్ సంగీత సారథ్యంలో లలిత సంగీత కచేరీ నిర్వహించారు. ఇందులో దర్భా మృదురవళి, బీవీ విద్యాసాగర్, కుమారి ఎస్సీ మహతి ఆలపించిన లలిత గీతాలు శ్రోతలను అలరించాయి. ఆకాశవాణి అధికారులు డాక్టర్ చుండూరు మాణిక్యరావు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, దూరదర్శన్ సప్తగిరి సిబ్బంది, ఆకాశవాణి సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు. చివరగా విభాగం ప్రసారణ అధికారి ఎస్ఎల్ఎన్ రాజు వందన సమర్పణతో ఆకాశవాణి సంగీత సమ్మేళనం ఘనంగా ముగిసింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

అయ్యప్ప సేవాయ నమః

11 ఏళ్లుగా స్వాముల సేవలో అక్కయ్య నాయుడు ● భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, అయ్యప్ప స్వామికి 11 కేజీల వెండి సమర్పించిన భక్తులు





భక్తులు సమర్పించిన వెండితో రూపొందించిన అయ్యప్ప స్వామి, దీక్షాపరులకు అన్నదానం

మైలవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారక తిరుమల దేవస్థానం చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు సహకారంతో అయ్యప్ప భక్తులు సుంకర అక్కయ్య నాయుడు (సీఏ) ఆధ్వర్యంలో పట్టణంలోని శివాలయంలో అయ్యప్ప స్వాములకు నిర్వహించిన మహా అన్నసమారాధన ఆదివారం ప్రారంభించారు. 11 ఏళ్లుగా మైలవరం పరిసర ప్రాంతాల్లో వివిధ మాలాధారులకు దాతల సహకారంతో మహా అన్నసమారాధన చేపడుతున్నారు. ప్రారంభోత్సవం మొదటి రోజున స్వాములతో పాటు 1300 మంది భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల విరాళాలతో భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారికి, శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి వారికి భక్తులు సమర్పించిన 11 కేజీల వెండితో పూర్తి రజిత కవచధారణ జరిగింది. 60 రోజుల పాటు జరిగే ఈ మహా అన్నసమారాధనను మాలాధారులు సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వాహకులు సుంకర అక్కయ్య నాయుడు కోరారు. ఏటా కొత్తగుండ్ల ఆంజనేయులు పరివేక్షలో స్వాములకు అన్నసమారాధన జరుగుతుంది. ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టిన దాతలందరికీ భక్తులు కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

పికప్‌కు ప్యాకప్!

(5వ పేజీ తరువాయి)

అవుతుండటంతో వ్యాపారం అమాంతం పెరిగింది. దీంతో కార్గో విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవటం కోసం ఆర్టీసీ అధికారులు విజయవాడ కేంద్రంగా డోర్ పికప్ - డోర్ డెలివరీ విధానానికి శ్రీకారం చుట్టారు.

డోర్ పికప్‌కు రాకపోవడంతో అవస్థలు

ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా బుక్ చేసుకునేవారు డోర్ పికప్ ఆప్షన్ ఎంచుకుంటే.. ఇంటికి వచ్చి పికప్ చేసుకోవటానికి ఎవరూ రావటం లేదు. దీంతో విసిగి వేసారిన వినియోగదారులు బస్‌స్టేషన్‌కు వచ్చి ఇవ్వాల్సి వస్తోంది. ఎందుకు పికప్‌కు రావటం లేదంటే సమాధానం చెప్పే పరిస్థితి కూడా ఉండటం లేదు. కొంతమంది బాధ్యులైన ఆర్టీసీ అధికారుల సమాచారం తెలుసుకుని ఫిర్యాదులు చేస్తున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టు సంస్థను మందలిస్తే డోర్ పికప్ చేపడుతున్నారు. పికప్‌తో పాటు డోర్ డెలివరీ ఆప్షన్ ఎంచుకున్నా .. డోర్ డెలివరీ కూడా చేయడం లేదు. కొంతమంది బస్‌స్టేషన్‌కు వచ్చి డోర్ డెలివరీ ఆప్షన్ ఇచ్చినా.. ఆ ప్రాంత రిసీవింగ్ పాయింట్‌కు పార్శిల్ చేరుకుంటుందే తప్ప డోర్ డెలివరీ మాత్రం చేయటం లేదు.

అదే సంస్థకు ఎందుకు ఈ బాధ్యతలు?

డోర్ పికప్ - డోర్ డెలివరీ విధానాన్ని ప్రస్తుత లాజిస్టిక్స్ సంస్థకు అప్పగించటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. లాజిస్టిక్స్ విభాగాన్నే సరిగా నిర్వహించలేకపోతున్న సంస్థకు.. పికప్ - డెలివరీ బాధ్యతలు అప్పగించటం పట్ల ఆరోపణలు కూడా వస్తున్నాయి. పికప్, డెలివరీలను స్ప్లిట్ చేసి మరో కాంట్రాక్టు సంస్థకు అప్పగించి ఉంటే ఈ సమస్యలు వచ్చేవి కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ కామర్స్ సంస్థల పికప్, డెలివరీలను ఈ కార్ట్ లాజిస్టిక్స్ వంటి మరో సంస్థలతో చేయిస్తుంటాయి. దీంతో ఈ కామర్స్ సంస్థలు ఉత్పత్తిదారుల నుంచి పికప్ చేసుకోవటంతో పాటు.. ఎక్కడికి డెలివరీ చేయాలో అక్కడికి సురక్షితంగా పార్శిల్స్‌ను చేరవేస్తుంటాయి. ఒకవేళ వినియోగదారులకు ఆ ఉత్పత్తులు నచ్చకపోతే రిటర్న్ పెడితే మళ్లీ వారి ఇళ్లకు వెళ్లి వాటిని పికప్ చేసుకుంటారు. విసుగు, విరామం అనేది లేకుండా సర్వీసు అందిస్తారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగంలో డోర్ పికప్ - డోర్ డెలివరీ విభాగంలో ఇది మచ్చుకు కూడా కనిపించటం లేదు. పికప్ - డెలివరీ విధానాన్ని కూడా ఇదేవిధంగా మెరుగు పరచుకోవాల్సిన అవసరం ఉంది.

ఇక ప్రజా సేవలో ఆశా కిరణ్

(5వ పేజీ తరువాయి)

చూడని గొప్పవ్యక్తి అని కొనియాడిన ఆశ కిరణ్ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా జీవితంలోకి వచ్చినట్టు చెప్పారు. వంగవీటి మోహన రంగా విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ముందు ప్రజాసేవ.. ఆ తర్వాత రాజకీయ ప్రవేశం

ఒక్కసారిగా రాజకీయాల్లోకి రావడంకంటే కూడా.. ప్రజా జీవితంలోకి అడుగు పెట్టి అన్ని వర్గాలకు దగ్గర కావాలన్నది ఆశ కిరణ్ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ప్రజా జీవితంలోకి తాను అడుగుపెడుతున్నానని పదేపదే ఆమె చెప్పటం వ్యూహాత్మకమని తెలుస్తోంది. ఒకవైపు రాధా - రంగా మిత్ర మండలిని బలోపేతం చేస్తానని.. సొంత సామాజిక వర్గానికి అండగా ఉంటానన్న భరోసాను ఇవ్వటంతో పాటు.. మరోవైపు కులం ముద్ర పడకుండా ఉండటానికి రంగా నాడు ఆచరించిన కుల, మత సమానత్వాలను కూడా గుర్తు చేశారు.

రంగాను చూసినట్టుగానే..

రంగా రూపం ఇప్పటికి ఆనాటి తరానికి చెరగని జ్ఞాపకంగా ఉంది. ఆయన వారసురాలు ఆశ కిరణ్ ఒక్కసారిగా కనిపించేసరికి మళ్లీ రంగా చూసినట్టుగా ఉందని ఆయన అభిమానులు అంటున్నారు.

ఫ్యాషన్ డిజైనర్‌గా కెరీర్ ఆరంభించి..

రంగా కుమార్తె వంగవీటి ఆశ కిరణ్ ఉన్నత విద్యను అభ్యసించారు. తొలుత ఆమె ఫ్యాషన్ డిజైనర్‌గా కెరీర్ ఆరంభించారు. 2006లో బోధన్‌కు చెందిన యోగానంద్‌తో ఆమెకు వివాహం అయింది. భర్త సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. ఆశ కిరణ్ కూడా సాఫ్ట్‌వేర్ వైపు ఆకర్షితులయ్యారు. ఇద్దరూ కలిసి చాలా కాలం ఆస్ట్రేలియాలో ఉన్నారు. రెండేళ్ల కిందట ఆశ కిరణ్ భర్త పిల్లలతో కలిసి హైదరాబాద్ వచ్చారు. ఆశ కిరణ్ మామగారైన దుద్దెంపూడి సాంబశివరావు 1983లో టీడీపీ తరఫున బోధన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం ఆయన టీడీపీలో ఉన్నప్పటికీ క్రియాశీలక రాజకీయాలలో మాత్రం లేరు.

వెహికల్ డిపోలో డీజిల్ దొంగలు!

(5వ పేజీ తరువాయి)

దృష్టి సారించి విచారణ పూర్తి చేసింది.

రూ.3.60 లక్షల ఆయిల్ గోల్‌మాల్!

కార్పొరేషన్ తన వాహనాలకు ఆయిల్ అవసరాల కోసం వెహికల్ డిపోలో ఒక డీజిల్ ఆయిల్ పంపును నిర్వహిస్తోంది. ఈ పంప్ వాహన డిపో ఇన్‌చార్జి అయిన ఈఈ నియంత్రణలో ఉంటుంది. హెల్త్ విభాగం నుంచి ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ .. కార్పొరేషన్ శానిటేషన్ వాహనాలకు ఆయిల్ కూపన్లను జారీ చేస్తాడు. వీటిని ఈఈ సూచనల మేరకు మెకానికల్ విభాగం ద్వారా అందుబాటులో ఉంచుతారు. ఆయిల్ పంపు ఇన్‌చార్జి ఆయిల్‌ను తీసుకుని.. ఆయిల్ వినియోగ రిజిస్టర్‌లో వాహనాలకు ఎంత ఇండెంట్ కేటాయించిందో వివరాలను నింపాల్సి ఉంటుంది. ఈ రికార్డులను పరిశీలించగా, వినియోగించని (ఆఫ్ రోడ్)వాహనాలు, స్క్రాప్‌కు పంపిన వాహనాలు (కండెమ్న్)కు కూడా ఆయిల్‌ను నింపినట్టుగా నమోదు చేసినట్టుగా గుర్తించారు. ఏపీ 16 టీడీ 1518 , ఏపీ 16 టీబీ 5051, ఏపీ 16 టీబీ 1708, ఏపీ 16 టీఈ 1722 వాహనాలకు మొత్తం 5,633 లీటర్ల డీజిల్‌ను నింపినట్టుగా రికార్డులలో నమోదు చేసినట్టుగా గుర్తించారు. వాస్తవానికి ఈ వాహనాలు డీజిల్‌ను నింపినట్టుగా నమోదు చేసిన తేదీలు, సంవత్సరాల కంటే కూడా ముందే అవి ఆఫ్‌రోడ్, కండెమ్న్‌గా ఉన్నాయని విజిలెన్స్ నిగ్గుతేల్చింది. ఈ చర్యల ద్వారా రూ.3.60 లక్షల నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టుగా విజిలెన్స్ గుర్తించింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.కృష్ణదేవరాయలను విచారించగా.. తాను ఆయిల్ టోకెన్లు జారీ చేసిన విషయాన్ని అంగీకరించారని కూడా తెలిపింది.

దీనార్స్‌లో జీరో

(5వ పేజీ తరువాయి)

కేసులో ప్రస్తుతం రూ.30 కోట్ల వరకు డబ్బులకు ఆనవాళ్లు కనిపించడం లేదు. ఈ డబ్బులను ఏం చేశాడో ఆదిత్య చెప్పడం లేదు. అతని భార్య సుజాత నోరు విప్పుతున్నా అంతా ఆయనకే తెలుసునని చెబుతోంది. మరోపక్క ఏజెంట్‌గా వ్యవహరించిన బాలకృష్ణ కమీషన్ల రూపంలో పొందిన రూ.3కోట్లను ఎక్కడెక్కడ భద్రపరిచాడన్న విషయాన్ని పోలీసులు రాబడుతున్నారు. ఆదిత్య నుంచి భారీగా కమీషన్లు పొందిన మరో ఇద్దరు ఏజెంట్లను పోలీసులు గుర్తించారు. వారిని సోమవారం విచారణకు పిలిపించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. విచారణలో భాగంగా పోలీసులకు కొత్త ఆస్తుల చిరునామా లభించింది. ఆదిత్య ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్ములతో సొంతం చేసుకున్న ఆస్తుల లెక్కలను బయటకు లాగారు. హైదరాబాద్‌లో రూ.30కోట్ల వరకు ఆస్తులను సమకూర్చినట్టు గుర్తించారు. వాటిలో రూ..15కోట్ల ఆస్తులను జప్తు చేశారు. మిగిలిన రూ.15కోట్ల ఆస్తులను రెండు రోజుల్లో జప్తు చేయాలని భావిస్తున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 130,139, 150
చికెన్ విత్ స్కిన్ 250
చికెన్ స్కిన్‌లెస్ 260
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 635

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

లబ్బీపేట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, క్రీడలు మన జీవితంలో భాగం కావాలని శ్రీ శ్రీనివాస్ గ్రావిటీ విద్యా సంస్థల చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. మొగల్రాజపురంలోని సిద్ధార్థ పబ్లిక్‌స్కూల్‌లో ఆదివారం శ్రీనివాస గ్రావీటిస్ వార్షిక క్రీడాదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుల ఒత్తిడికి గురి కాకుండా వారికి మానసిక ఉల్లాసం కోసం క్రీడలు అవసరమన్నారు. తమ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 800 మంది విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, నవంబవరు 16 (ఆంధ్ర జ్యోతి) : కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈనెల 17న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో వుండి అర్జీలు స్వీకరిస్తార న్నారు. అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకొనేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

పిల్లల పండుగ 9 నుంచి

గవర్నర్‌పేట, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాలలో అమరావతి బాలోత్సవ్ 8వ పిల్లల పండుగను డిసెంబరు 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు అమరావతి బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం..మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే థీమ్ ముందుకు తెస్తూ పిల్లల పండుగకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటుగా ఇతర అంశాలలో విద్యార్థుల ప్రతిభను, శక్తి సామర్థ్యాలను ప్రదర్శించే వేదికగా బాలోత్సవం నిర్వహించనున్నామన్నారు మూడు రోజుల పాటు పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం బాలోత్సవం కమిటీ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బాలోత్సవ బాధ్యులు ఎన్. విద్యాఖన్నా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వై. సుబ్బారావు, కె. వెంకట్, యువీ రామరాజు, ఎస్. లెనిన్‌బాబు, జి. నారాయణరావు, టి. క్రాంతి పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

కార్తీకమాసం సందర్భంగా 26వ రోజు ఆదివారం చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

యూత్ కెరియర్ గైడెన్స్ పుస్తకావిష్కరణ

గాంధీనగర్, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మా, అగ్రికల్చరల్, ఇతర ఉన్నత చదువుల కోసం విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన కెరియర్ గైడెన్స్ యువత- భవిష్యత్తు "పుస్తకాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు. స్థానిక హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకాన్ని రూపొందించిన ఏఐవైఎఫ్ నాయకత్వాన్ని ఆయన అభినందించారు. పార్టీ నేతలు రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య నీరాజనం అభినందనీయం

● వేముల హజరత్తయ్య గుప్తా

విజయవాడ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నటరాజుకు ప్రీతియైన నృత్యాంశాలతో కార్తీకమాసంలో శివునికి నీరాజనం అందించడం అభినందనీయమని ప్రముఖ కళాకారుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ విధి భక్తి మార్గాలలో ప్రముఖంగా ఉండి భక్తులకు భక్తి భావ సమన్వితంగా మానసికోల్లాసం కలిగేలా కార్యక్రమం రూపొందించారన్నారు. ప్రదర్శన ఏర్పాటు చేసిన అమరావతి శాస్త్రీయ నాట్యాచార్యుల సంఘం శివోహం పేరుతో నిలపడం వారి భవిష్యత్ కార్యక్రమాలకు దోహదకారకంగా మలచబడుతుందని వివరించారు. ఈ కార్యక్రమం పాల్గొన్న వారికి గుప్తా చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. 24 మంది నాట్యాచార్యుల శిష్య బృందం ప్రదర్శనలో పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని వీడాలి

సత్యనారాయణపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని , అనవసరమైన గోడవల్లో తలదూరిస్తే నగరబహిష్కరణ తప్పదని సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ ప్రాంగణంలో రౌడిషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడు తూ రౌడీ, సస్పెక్ట్ షీట్ ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

రోగుల పాట్లు!

● కట్టింది ప్రసూతి ఆసుపత్రి కోసం
● పెట్టింది శానిటరీ కార్యాలయం, సచివాలయం
● ఇబ్బంది పడుతున్న మొగల్రాజపురం ఏడో డివిజన్ ప్రజలు



బందిల దొడ్డి సెంటర్‌లో భవనం

(మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి)

మొగల్రాజపురం ఏడో డివిజన్‌లో గర్భిణుల కోసం ఇరవై సంవత్సరాల క్రితం ప్రసూతి ఆసుపత్రిని వీఎంసీ నిధులతో నిర్మించారు. కాని ప్రసూతి ఆసుపత్రి కోసం కాకుండా ఇతర అవసరాలకు ఆ భవనాన్ని ఉపయోగిస్తున్నారు. దీనిపై నాయకులు కాని, అధికారులు కాని పట్టించుకోవడం లేదు. 7వ డివిజన్ బోయపాటి మాధవరావు రోడ్డులో బందిలదొడ్డి సెంటర్‌లో ఈ భవనం ఉంది. కొండ ప్రాంతంలో ఉండే మహిళలకు ఉపయోగపడేలా ఇక్కడ 10 పడకలతో ఆసుపత్రి ఉండాలని అప్పటి పాలకులు నిర్ణయించి ఆసుపత్రి కట్టారు. అట్టహాసంగా ప్రారంభించారు. ప్రసవం కోసం వచ్చే మహిళలకు పరీక్షు చేయడం, గర్భిణులకు ప్రసవం చేయడం, అవసరాన్ని బట్టి ఆపరేషన్లు చేయడం కోసం ఈ భవనాన్ని నిర్మించారు.

తరువాత దీంట్లో కొన్నాళ్లు కుట్టు శిక్షణా కేంద్రం, కొన్నాళ్లు ఆయుర్వేద డిస్పెన్సరీ ఇపుడు వీటి తో పాటు సచివాలయం ఏర్పాటు చేశారు. 6, 7 డివిజన్‌లలో సుమారు 20వేల మంది జనాభాకు ఇక్కడ ఆసుపత్రి అవసరం. ఈ ప్రాంతంలో కొండల మీద ఎక్కువ పేద, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటారు. వీరిలో ప్రసవం కోసం పేద మహిళలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటే కొండ దిగిరావాలి, అలాగే దూరాభారం. అందుకనే ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి స్తోమతకు మించి బిల్లులు కడుతుంటారు. కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళదామన్నా అది రెండు కిలోమీటర్ల అవతల రెడ్ సర్కిల్‌లో ఉంది. దీనిపై వివరణ కోసం సర్కిల్-3 ఏఎంహెచ్‌వో గోపాల్ నాయక్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



సహస్ర లింగార్చన చేస్తున్న ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి

దుర్గగుడిలో సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా దుర్గగుడిలో ఆదివారం రాత్రి సహస్రలింగార్చన సేవ, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలు అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి నమక, చమక పారాయణలతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకస్వాములు సహస్రలింగార్చనలో బిల్వ పత్రాలు, వివిధ రకాల పుష్పాలను సమర్పించారు. మంత్ర పుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద స్వీకరణ చేశారు. ప్రదోష కాలములో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. భక్తులచే ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం నిర్వహిస్తున్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గామల్లేశ్వర దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు ఆదివారం ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. సూర్యాపేటకు చెందిన వనమ రవికుమార్ కుటుంబ సభ్యులు వనమ అక్షయ్ కుమార్ పేరిట అన్నదాన పథకానికి రూ.1, 00,116లు, శ్రీకాకుళానికి చెందిన ఎం.ప్రభాకర్ దంపతులు జోషి మా జయశ్రీ, జోశ్రిక జయశ్రీ పేరిట రూ.1, 00,000లు, హైదరాబాద్ రాజేంద్ర నగర్‌కు చెందిన పట్టపు భగవత్ ప్రసాద్, చంద్రావతి కుటుంబ సభ్యులు విరాళంగా రూ.1,00,116లు అధికారులకు అందజేశారు.





కనుల పండువగా కార్తీక దీపోత్సవం

● దీప కాంతులతో కృష్ణానదికి సరికొత్త శోభ
● కార్తీక మాస దీపోత్సవానికి ముఖ్య అతిథిగా కేశినేని జానకిలక్ష్మి
● అంగరంగ వైభవంగా కృష్ణా పుష్కర్‌ఘాట్‌లో దీపోత్సవం



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకి లక్ష్మి

కృష్ణలంక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పరమశివుని దివ్యాశీస్సులు కోసం నిర్వహించిన కార్తీక దశ సహస్ర దీపోత్సవం కన్నుల పండువగా వుందని, దీప కాంతుల్లో కృష్ణానదికి సరికొత్త శోభ సంతరించుకొందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి కేశినేని జానకి లక్ష్మీ అన్నారు. కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ శారద సనత్సంద్ర పురోహిత కార్యాలయం నిర్వాహకులు దేవరకొండ సనత్ కుమార్ శర్మ అధ్వర్యంలో ఆదివారం కృష్ణలంక పాత పోస్టాఫీసురోడ్డులో కుర్తాళం పీఠం సమీపాన కృష్ణా పుష్కర ఘాట్‌లో జరిగిన కార్తీక దశ సహస్ర దీపోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని జానకీలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సామూహిక పూజలో పాల్గొన్నారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. దీపోత్సవానికి వచ్చిన మహిళలు, యువతులు, ఓంకార నాదాలు, వేదమంత్రాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. కేశినేని జానకి లక్ష్మీ మాట్లాడుతూ గత పదకొండు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. పురాణ కాలం నుంచి వస్తున్న సంప్రదాయాలను చిన్నారులకు తల్లిదండ్రులు నేర్పించాలని సూచించారు. వేలాది దీపాల కాంతులతో కృష్ణా పుష్కర ఘాట్ ప్రాంతం అంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

చాలామంది ప్రతిభావంతులు
ప్రీమెచ్యూర్‌గా పుట్టినవారే



డాక్టర్ బ్రాజిష్టా

భారతీనగర్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): చాలామంది ప్రతిభావంతులు, ప్రపంచాన్ని మార్చిన మేధావులు ప్రీమెచ్యూర్‌గా పుట్టినవాళ్లేనని రెయిన్బో పిల్లల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బ్రాజిష్టా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నవంబరు 17న ప్రపంచ ప్రిమెచ్యూరిటీ డే గా ప్రకటించిందన్నారు. శిశువు 37 వారాలు నిండకుండానే పుట్టడాన్ని ప్రిమెచ్యూరిటీ బేబీ అంటామ న్నారు. మొత్తంగా 10 శాతం మంది పిల్లలు ప్రిమెచ్యూరిటీగా పుట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ పుట్టిన పిల్లలకు పుట్టిన వెంటనే పలు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా వీరిలో శ్వాసకోశ, హృదయ సంబంధ, జీర్ణకోశ, ఎదుగుదలకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ పుట్టిన పిల్లలను పుట్టిన వెంటనే నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎన్ఐసియు) నవజాతిశిశు సంరక్షణ విభాగం)లో తగిన సంరక్షణను అందజేయడం వలన ఈ సమస్యలు పూర్తిగా తొలగిపోయి సాధారణంగా నెలల నిండి పుట్టిన పిల్లల లాగా ఉంటాయన్నారు. చాలామంది ప్రిమెచ్యూరిటీ బేబిసికి తెలివితేటలు సరిగా ఉండవు అనుకుంటారు. కానీ అది నిజం కాదని అన్నారు. చాలామంది ప్రతిభావంతులు, ప్రపంచాన్ని మార్చిన మేధావులైన అల్బర్ట్, ఐన్‌స్టీన్, ఐజాక్ న్యూటన్, ఛార్లెస్ డార్విన్, పికాసో, నెపోలియన్ వంటివారు ప్రీమెచ్యూర్‌గా పుట్టినవాళ్లేనని అన్నారు. ప్రిమెచ్యూర్ పిల్లలకు బలమైన ఆరంభం ఇవ్వడంతో వీరి భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుందన్నారు. ఈఏడాది ప్రిమెచ్యూరిటీ డే థీమ్‌లో ప్రత్యేక కార్యక్రమాలను ఆసుపత్రిలో నిర్వహించబడతాయన్నారు.

కార్మికనగర్ కొండపై గంజాయి బ్యాచ్ ఆగడాలు

● మత్తులో స్థానికులపై దాడి

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం రెండో డివిజన్ పరిధిలోని మాచవరం కార్మికనగర్ కొండ ప్రాంతంలో గంజాయి బ్యాచ్ ఆగడాలు మితిమీరిపోతున్నాయి. స్థానికులు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు. ఆదివారం కొందరు గంజాయ్ బ్యాచ్ సభ్యులు మత్తులో ఒకరిద్దరిపై దౌర్జన్యానికి పాల్పడి దాడి చేశారు. ఇతర ప్రాంతానికి చెందిన సుమారు 10 నుంచి 15 మంది గంజాయి బ్యాచ్ సభ్యులు కార్మికనగర్ కొండప్రాంతానికి వచ్చి కొందరు యువకులతో కలిసి మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. అనంతరం స్థానికులపై దాడులకు పాల్పడుతున్నారు. ఖాళీగా ఉన్న ఇంటి తాళాలు పగలగొట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు స్పందించి వారి ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.



అవగాహన ర్యాలీలో విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది

మయోపియా కంటి వ్యాధిపై అవగాహన ర్యాలీ

పెనమలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం మయోపియా కంటి వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి నుంచి వీఆర్ సిద్ధార్థ కళాశాలల వరకు జరిగిన ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెనమలూరు సీఐ వెంకటరమణ మాట్లాడుతూ, కంటికి సంబంధించిన పలు రకాల వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఎల్వీప్రసాద్ ఆసుపత్రి వర్గాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయా గంగూలీ మాట్లాడుతూ, పిల్లల నేత్ర సంరక్షణ వారోత్సవం సందర్భంగా కంటి వ్యాధుల పట్ల ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు.



ఐటీఐ రోడ్డులో ప్రమాదకరంగా కంకర గుట్ట

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

ఐదవ నెంబర్ రోడ్లో ఐటీఐ కాలేజీ సమీపంలో ఇటీవల సైడు డ్రైనేజీ, రోడ్డు మరమ్మతుల నిమిత్తం కంకర గుట్లు వేశారు. ఈ రాళ్ల (రాళ్లగుట్ట) వేసి అలా వదిలివేయడంతో వాహనాల రాకపోకలకు అడ్డుగా వస్తుంది. ఈ ప్రాంతంలో డివైడర్ కటింగ్ ఉండటంతోపాటు ఎల్ఐసీ కాలనీకి వెళ్లే రోడ్డుకు అనుసంధానంగా ఉండడంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో కొన్ని సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనాలకు దారి ఇవ్వబోయి ఈ రాళ్ల గుట్టపై పడిపోతున్నారని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్యుపంక్చర్ విధానంపై అవగాహన ఉండాలి

ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ రాజారావు

కానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆక్యుపంక్చర్ విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ రాజారావు అన్నారు. ప్రపంచ ఆక్యుపంక్చర్ దినోత్సవం పురస్కరించుకొని కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ హోం కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆక్యుపంక్చర్ రంగంలో దేశవ్యాప్తంగా విశిష్ట కృషి చేసిన 42 మందిని సేవారత్న, వైద్యరత్న అవార్డులతో ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పా భారత్ సంస్థ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారావు మాట్లాడుతూ, మందులు వాడకుండా, సర్జరీలు తగ్గించేందుకు ఆక్యుపంక్చర్ విధానం ఎంతగానో దోహద పడుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-259777

స్థలం అమ్మకం
విజయవాడ, ఏలూరు రోడ్డును ఆనుకొని SRR కాలేజి ప్రక్కన 480 చ.గ స్థలం, పడమర ఫేస్ అమ్మకమునకు కలదు. సంప్ర సెల్ : 93999 96959, 93934 75164
AJB-259810

HOUSE FOR SALE
ప్రసాదంపాడు నందు 55 చ.గ. స్థలములో గ్రౌండ్ ఫస్ట్ సెకండ్ ఫ్లోర్స్ గల 3 అంస్తుల బిల్డింగు అమ్మకము. గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 షాపులు అద్దె PER MONTH 27,000/-, రేటు 55 లక్షలు. ✆ 76720 94576
AJB- 132

LEASE (OR) RENT
2.75 Acres Comm Land Suitable for School or College or Warehouse, Off NH 205, 15 Mits from Tirupati. Cont : 9445253860
AJG-267409

TO-LET COMMERCIAL
విజయవాడ BRTS రోడ్ ఉత్తర ఫేసింగ్ 1st & 2nd ఫ్లోర్, 3620 sft. ఆఫీసులకు, బ్యాంక్‌లకు అద్దెకు ఇవ్వబడును. సంప్ర : సెల్ : 93999 96959, 93934 75164
AJB-259811

WANTED
Kotak నూతన బ్యాంక్ నందు పనిచేయుటకు Rretired. VRS teachers మరియు గృహిణులు కావలెను. అర్హత: SSC To PG. సంప్రదించండి: సెల్: 99660 13779
AJB-235792

★ ప్రముఖ బ్యాంకింగ్ / ఫైనాన్స్ సంస్థ నందు విజయవాడలో పనిచేయుటకు హౌస్ కీపింగ్ బాయ్స్ సిబ్బంది కావలెను. జీతం: 15-17వేలు వరకు, పని గంటలు : 8 గం. సంప్ర: 7396437166
AJH-776

DISTANCE EDUCATION
శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA. ✆ 99493 08940
AJB-235793

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 290/- ప్రతి అదనపు లైనుకు రూ॥ 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777 మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733 గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 635

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

కార్పొరేషన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలోనూ నిర్వహిస్తున్నట్టు విజయవాడ నగరపాలకసంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో వీఎంసీ ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అర్జీ పెట్టికొని పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ప్రజా పిర్యాదు పరిష్కార వేదిక ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలోతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెలూన్ ముసుగులో కాల్‌మనీ వ్యాపారం

● సీపీకి ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెలూన్ షాపు ముసుగులో ఓ వ్యక్తి కాల్‌మనీ వ్యాపారం చేస్తూ తొలుత డబ్బులు అవసరమైన వారికి తక్కువ వడ్డీకి ఇస్తానని చెప్పి డబ్బులు ఇచ్చిన తరువాత అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడని పలువురు వాపోతున్నారు. బాధితులు తీసుకున్న డబ్బులు మొత్తం ఇచ్చినప్పటికీ, బాధితుల వద్ద తీసుకున్న ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. ఈ క్రమంలో మోహన్ గణపతిరావు రోడ్డులో తను సెలూన్ షాపు నిర్వహిస్తున్న తణికెళ్ల వాసును వడ్డీకి డబ్బులు అడగ్గా, డబ్బులు కావాలంటే రూ.3లు చొప్పున ఇస్తానని చెప్పాడు. అందుకు మోహన్ ఇష్టపడి రూ.1,70,000లు రూ.3లు వడ్డీ చొప్పున తీసుకున్నాడు. అందుకుగాను వాసు మోహన్ వద్ద నుంచి ఆరు ఖాళీ చెక్కులు, ఆరు ప్రామిసరీ నోట్లు తీసుకున్నాడు. అయితే వాసు రెండవ నెల నుంచే మోహన్ వద్ద నుంచి నూటికి రూ.9లు వడ్డీ చొప్పున వసూలు చేశాడు. బాధితుడు మోహన్ అధిక వడ్డీ చెల్లించలేక తాను తీసుకున్న అసలు రూ.1,70,00లకు వడ్డీతో సహా మొత్తం రూ.6,10,000లు 2023 నాటికి వాసుకు చెల్లించాడు. డబ్బులు ఇచ్చినప్పుడు వాసుని తాము మొదట్లో ఇచ్చిన ఆరు ఖాళీ చెక్కులు, ఆరు ప్రామిసరీ నోట్లు ఇవ్వమని అడిగారు. దీంతో రేపు మాపు అంటూ వాసు కాలయాపన చేశాడు. మోహన్ భార్య కిరణ్మయి (మూర్ఛవ్యాధి) తాము ఇచ్చిన చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇవ్వమని గట్టిగా అడగ్గా ఇంకా మీరు నాలుగు, అయిదు నెలలు వడ్డీ ఇవ్వాలని, ఆ డబ్బులు ఇచ్చినప్పుడే వాటిని ఇస్తానంటూ చెప్పాడు. దీంతో బాధితురాలు గత 27వ తేదీన పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసి వారమైనప్పటికీ పోలీసుల నుంచి ఫోన్ రాకపోవటంతో ఆమె మళ్లీ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి రైటర్ నాగరాజుకు తమ సమస్యను చెప్పుకోవటానికి ప్రయత్నించగా, కనీసం బాధితురాలి సమస్యను వినకుండా సీపీ కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులు 15 రోజులలో పరిష్కారం టైమ్ ఉంటుందని, అప్పటి వరకు ఆగలేరా అంటూ మండిపడ్డాడు.

సంతాన ప్రాప్తిరస్తు చిత్రబృందం సందడి



మాట్లాడుతున్న చిత్ర హీరో హీరోయిన్‌లు విక్రాంత్, చాందిని చౌదరి

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో సంతాన ప్రాప్తిరస్తు చిత్ర బృందం ఆదివారం సందడి చేసింది. గాంధీనగర్‌లోని జయరామ్ థియేటర్‌లో సంతాన ప్రాప్తిరస్తు చిత్రాన్ని ఆ చిత్ర హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని చౌదరి, మరికొందరు నటులు సినీ ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా హీరో విక్రాంత్ మాట్లాడుతూ సంతాన ప్రాప్తిరస్తు ప్రేక్షకులు ఆదరించటం తమకు ఎంతో సంతోషంగా ఉం దన్నారు. విడుదలైన అన్ని కేంద్రాలలో ప్రేక్షకుల నుంచి విశేష స్పం దన లభిస్తుందని తెలిపారు. తమ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులను కలుసుకుని వారికి కృతజ్ఞతలు చెప్పేందుకు విజయ యాత్ర చేపట్టినట్టు చెప్పారు. హీరోయిన్ చాందిని చౌదరి మాట్లాడుతూ ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని తెలిపారు. ఈ చిత్రం కోసం తమ టీమ్ ఎంతగానో కష్టపడి పనిచేసిందని, ఆ కష్టానికి ప్రేక్షకుల నుంచి ప్రతిఫలం రావటం ఆనందంగా ఉందన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

పాయకాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాయకాపురం రాజీవ్‌నగర్ ప్రాంతంలో బాలికా వివాహాన్ని ఆదివారం నున్న రూరల్ పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన బాలిక(16) నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. సదరు బాలికకు కుటుంబ సభ్యులు స్థానిక యువకుడితో ఆదివారం పెళ్లి చేసేందుకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న వాసవ్య మహిళా మండలి సభ్యురాలు, అంగన్వాడీ సిబ్బంది ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వివాహం జరుగుతున్న ఇంటి వద్దకు వెళ్లిన పోలీసులు మైనర్ వివాహాన్ని అడ్డుకుని, బాలిక తల్లిదండ్రులతో పాటుగా బాలికతో పెళ్లి కుదుర్చుకున్న యువకుడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు.

యూత్ కెరియర్ గైడెన్స్ పుస్తకావిష్కరణ

గాంధీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మా, అగ్రికల్చరల్, ఇతర ఉన్నత చదువుల కోసం విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన కెరియర్ గైడెన్స్ యువత-భవిష్యత్తు " పుస్తకాన్ని సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి ఆవిష్కరించారు. స్థానిక హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకాన్ని రూపొందించిన ఏఐవైఎఫ్ నాయకత్వాన్ని ఆయన అభినందించారు. పార్టీ నేతలు రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

సత్యనారాయణపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో భాగమని, అటువంటి వృద్ధాప్యం శాపంగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పూమా హార్ట్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ ఏ.నీరజ అన్నారు. అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని విజయ్ నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు కైలాష్ సోలంకీ, దినేష్ సోలంకీ, ప్రవీణ్ సోలంకీ సహకారంతో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, మందులను పంపిణీ చేశారు. వయోవృద్ధ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లాహరికుమార్, ట్రస్టీలు అమర ఉమామహేశ్వరరావు, తట్టి అర్జునరావు, సతీష్‌కుమార్, పీ.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్, గోదావరి పాల్గొన్నారు.

పిల్లల పండుగ 9 నుంచి

గవర్నర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాలలో అమరావతి బాలోత్సవ్ 8వ పిల్లల పండుగను డిసెంబరు 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు అమరావతి బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం..మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే థీమ్ ముందుకు తెస్తూ పిల్లల పండుగకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. మూడు రోజుల పాటు పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం బాలోత్సవం కమిటీ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఎన్. విద్యాఖన్నా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వై. సుబ్బారావు, కె. వెంకట్, యువీ రామరాజు, ఎస్. లెనిన్‌బాబు, జి. నారాయణరావు, టి. క్రాంతి పాల్గొన్నారు.

దుర్గగుడిలో సహస్ర లింగార్చన



సహస్ర లింగార్చన చేస్తున్న ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి

ఇంద్రకీలాద్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా దుర్గగుడిలో ఆదివారం రాత్రి సహస్రలింగార్చన సేవ, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలు అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి నమక, చమక పారాయణలతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకస్వాములు సహస్ర లింగార్చనలో బిల్వ పత్రాలు, వివిధ రకాల పుష్పాలను సమర్పించారు. మంత్ర పుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద స్వీకరణ చేశారు. ప్రదోష కాలములో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. భక్తులచే ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం (ఆర్జిత సేవ) నిర్వహిస్తున్నారు. దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

సూర్యోపాసన సేవ

కార్తీకమాసం చివరి ఆదివారం కావటంతో ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆలయ అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపాచార పూజలు నిర్వహించారు. అర్చనాది కార్యక్రమాలను పూర్తిచేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు. ఉభయదాతలు, పాల్గొని సూర్యనారాయణమూర్తికి పూజలు చేశారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గామల్లేశ్వర దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు ఆదివారం ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు. సూర్యాపేటకు చెందిన వనమ రవికుమార్ కుటుంబ సభ్యులు వనమ అక్షయ్ కుమార్ పేరిట అన్నదాన పథకానికి రూ.1,00,116లు, శ్రీకాకుళానికి చెందిన ఎం.ప్రభాకర్ దంపతులు జోషిమా జయశ్రీ, జోశ్రిక జయశ్రీ పేరిట రూ.1,00,000లు, హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన పట్టపు భగవత్ ప్రసాద్, చంద్రావతి కుటుంబ సభ్యులు విరాళంగా రూ.1,00,116లు అధికారులకు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో జస్టిస్ హరినాథ్ దంపతులు



జస్టిస్ హరినాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న టెంపుల్ సూపరింటెండెంట్ చందు శ్రీను

ఇంద్రకీలాద్రి: దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వారికి వేద పండితులు వేద ఆశీర్వచన, మండపంలో అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం టెంపుల్ సూపరింటెండెంట్ చందు శ్రీను వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

నేడే చూడండి
అప్సర సినిమా



రోజూ 3 ఆటలు
11-30AM, 2-30PM, 6-30PM
www.bookmyshow.com

NAVRANG A/c
GRAND GALA 2ND WEEK



తెలుగు 3డి - రోజూ 4 ఆటలు
11-45AM, 3-00PM, 6-45PM, 9-45PM
ONLINE TICKETS AVAILABLE IN " BOOK MY SHOW"



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుజనా చౌదరి, అధికారులు, కార్పొరేటర్లు

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం

● పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి

పెనమలూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి సూచించారు. ఆదివారం తాడిగడపలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర అభివృద్ధి పనులను గురించి కార్పొరేటర్లను, అధికారులను వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకొన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించిన వివరాలు, అసంపూర్తిగా ఉన్న, నిర్మాణం చేపట్టవలసిన ఇళ్ల వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. సమీక్ష కార్యక్రమంలో అధికారులు డీ చంద్రశేఖర్, కే సత్యవతి, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, ఈఈ జే శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్, చంద్రబోస్, వివిధ శాఖల అధికారులు, కూటమి కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మహదేవు అప్పాజీరావు, బుల్లా విజయ్‌కుమార్, గుడివాడ నరేంద్ర రాఘవ, అర్షద్, ఉమ్మడి వెంకటేశ్వరరావు, మైలవరపు మాధురి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ అవార్డుల ప్రదానోత్సవం

గాంధీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అక్యుపంక్చర్ దినోత్సవం సందర్భంగా అక్యుపంక్చర్ రంగంలో దేశవ్యాప్తంగా విశేషంగా కృషి చేసిన వారిని అక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీస్ అసోసియేషన్ ఆఫ్ భారత్) ఎస్పా భారత్ ఆధ్వర్యంలో సత్కరించారు. నగరంలోని ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయంలో 42 మందికి సేవారత్న, వైద్యరత్న అవార్డులతో ఆదివారం సత్కరించారు. ఎస్పా భారత్ వ్యవస్థాపక జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా అక్యుపంక్చర్ అవగాహన చికిత్స శిక్షణ , అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు మాట్లాడుతూ ఎటువంటి మందులు వాడకుండా, సర్జరీలు తగ్గించి మూల సమస్యను తగ్గించేందుకు అక్యుపంక్చర్ విధానం ఉపయోగపడుతుందన్నారు. ఎస్పాభారత్ జాతీయ అధ్యక్షుడు అలవాల రవి తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని వీడాలి: సీఐ లక్ష్మీనారాయణ

సత్యనారాయణపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని , అనవసరమైన గొడవల్లో తలదూరిస్తే నగరబహిష్కరణ తప్పదని సత్యనారాయణ పురం సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తన ఉన్న వారి రౌడీషీట్లను తొలిగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్ల ఫింగర్‌ప్రింట్ డైవైసర్ అటెండెన్స్ వేశారు. ఈ కౌన్సెలింగ్‌లో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, దేవదాయ ధర్మదాయ శాఖ

5 షాపులకు సీల్డ్ టెండర్స్ కమ్ బహిరంగ లైసెన్సు హక్కుల వేలం ప్రకటన

విజయవాడ-1 వ పట్టణం లింగంభొట్ల వారి వీధిలో శ్రీ దినవహి వారి సత్రమునకు చెందిన డోర్ నెం.11-48-2 లోని ఈ దిగువ షెడ్యూలు దాఖలా షాపులకు 27-11-2025 ఉదయం 11.00 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో సత్రము కార్యాలయములో లైసెన్సు హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం జరుపబడును.

షాపు నెం.	షాపు ప్రదేశము	విస్తీర్ణం చే.గ	ప్రథమ ధరావత్తు	లైసెన్స్ కాలపరిమితి	సెక్యూరిటీ
1	గ్రౌండ్ ఫ్లోర్	247	50,000	స్వాధీన పరచిన తేదీ నుండి మూడు సంవత్సరములు	12 నెలల అద్దె
9	ఫస్ట్ ఫ్లోర్	294	50,000		12 నెలల అద్దె
10	ఫస్ట్ ఫ్లోర్	294	50,000		12 నెలల అద్దె
11	ఫస్ట్ ఫ్లోర్	294	50,000		12 నెలల అద్దె
12	ఫస్ట్ ఫ్లోర్	294	50,000		12 నెలల అద్దె

ఇతర వివరములకు ఆఫీసు పనివేళలలో లేక 99120 50312 నెంబరులో సంప్రదించగలరు.
17.11.2025
కార్యనిర్వహణాధికారి

మర్యాదపూర్వకంగా..



ఎంపీ కేశినేని చిన్నికి పుష్పగుచ్ఛం అందిస్తున్న యేదుపాటి వెంకట రమణి

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గురునానాక్ కాలనీలో విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన యేదుపాటి వెంకట రమణి భర్త రామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి రమణిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి పదవులు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యేర్నేని వేదవ్యాస్, నరసింహాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, డివిజన్ ప్రధాన కార్యదర్శి పచ్చవ మల్లికార్జున పాల్గొన్నారు.

నగరాల వనసమారాధన



అనుమతి పత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

చిట్టినగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరాల వనసమారాధన కార్యక్రమం ఆదివారం పాముల కాలువ అంబాపురం తోటలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్టినగర్‌లో కొలువై ఉన్న నగరాల సీతారామస్వామి మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం స్వయపరిపాలనను 5సంవత్సరాలు (ఎగ్జామ్షన్) అనుమతి పత్రాన్ని దేవస్థాన కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతురావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులకు ఎంపీ కేశినేని శివనాథ్ అందజేశారు. నగరాలు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కామందులు నరసింహారావు ,మజ్జి శ్రీనివాసు, మజ్జి ఈశ్వరరావు, తమ్మిన సూర్యకుమారి, నగరాల కుల పెద్దలు బాయిన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గవర్నర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా 26వ రోజు ఆదివారం చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య పర్యవేక్షణలో ప్రసాద వితరణ చేశారు.

పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు పెంచడంలో

ఉపాధ్యాయులది కీలకపాత్ర

వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు పెంచటంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ రెహానా బేగం అన్నారు. విజయవాడలోని విద్యాంజలి హైస్కూల్‌లో ఆదివారం మరో గ్రంథాలయ ఉద్యమం నేతృత్వంలో పాఠశాలలు, కళాశాలల్లో పుస్తక పఠన ఆవశ్యకత పై జరిగిన చర్చా గోష్ఠిలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదివే అలవాటు ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటారని తెలిపారు. పుస్తకాలు చదవటం వలన పిల్లల్లో బాషా నైపుణ్యాలు, సృజనాత్మకత పెరుగుతాయన్నారు. పాఠశాలలో ప్రతిరోజూ రీడింగ్ అవర్, ప్రతి వారం స్టోరీ అవర్ నిర్వహించటం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. విజయవాడ రీజియన్ ఆర్పీఎఫ్ సిఐ మధుసూదన్ రావు మాట్లాడుతూ పుస్తకాలు చదివే అలవాటు పెరిగితే పిల్లలు మొబైల్ ఫోన్ వ్యసనం నుంచి బయటపడతారని తెలిపారు. ఏపీటిఎఫ్ ప్రతినిధి టి.నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆదేశాలు జారీ చేస్తే పాఠశాలలో లైబ్రరీ అవర్ సమర్థవంతంగా అమలవుతుందని తెలిపారు. పీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రసన్న మాట్లాడుతూ టీచర్లు, ప్రిన్సిపాల్స్ చిత్తశుద్ధిగా పని చేసి ప్రతిస్కూల్లో లైబ్రరీలు, రీడింగ్ కల్చర్ పెంచాలన్నారు. లక్ష్మణరావు, వీరప్పయ్య పాల్గొన్నారు.

నృత్య నీరాజనం అభినందనీయం

● వేముల హజరత్తయ్య గుప్తా



నాట్యం చేస్తున్న నృత్యకారిణులు

విజయవాడ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నటరాజుకు ప్రీతియైన నృత్యాంశాలతో కార్తీకమాసంలో శివునికి నీరాజనం అందించడం అభినందనీయమని ప్రముఖ కళాకారుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ విధి భక్తి మార్గాలలో ప్రముఖంగా ఉండి భక్తులకు భక్తి భావ సమన్వితంగా మానసికోల్లాసం కలిగేలా కార్యక్రమం రూపొందించారన్నారు. ప్రదర్శన ఏర్పాటు చేసిన అమరావతి శాస్త్రీయ నాట్యాచార్యుల సంఘం శివోహం పేరుతో నిలపడం వారి భవిష్యత్ కార్యక్రమాలకు దోహదకారకంగా మలచబడుతుందని వివరించారు. ఈ కార్యక్రమం పాల్గొన్న వారికి గుప్తా చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. 24 మంది నాట్యాచార్యుల శిష్య బృందం ప్రదర్శనలో పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు

గవర్నర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వేస్ట్ మెటీరియల్‌తో క్రాఫ్ట్ చేయించారు. వివిధ పాఠశాలల నుంచి పోటీలకు 200 మంది చిన్నారులు తరలివచ్చారు. సంగీత విభావరి, ఏకపాత్రాభినయం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, బ్రైట్ మైండ్స్ సంస్థ అధ్యక్షురాలు స్వాతి పూర్ణిమ పాల్గొన్నారు.

19న కోటి దీపోత్సవం

పాయకాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవి క్లబ్ పాయకాపురం ఆధ్వర్యంలో ఈనెల 19న కోటి దీపోత్సవం , శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు పందిరి బాల వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కండ్రిక వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలియజేశారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని శివపార్వతుల కల్యాణం తిలకించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

సత్యనారాయణపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. శతసహస్ర దీపార్చన సేవామండలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సత్యనారాయణపురం శిశువిద్యామందిరం పాఠశాల ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-259777

స్థలం అమ్మకం

» విజయవాడ, ఏలూరు రోడ్డును అనుకొని SRR కాలేజి ప్రక్కన 480 చ.గ. స్థలం, పడమర ఫేస్ అమ్మకమునకు కలదు. సంప్ర సెల్ : 93999 96959, 93934 75164
AJB-259810

HOUSE FOR SALE

» ప్రసాదంపాడు నందు 55 చ.గ. స్థలములో గ్రౌండ్ ఫస్ట్ సెకండ్ ఫ్లోర్స్ గల 3 అంస్తుల బిల్డింగు అమ్మకము. గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 షాపులు అద్దె. PER MONTH 27,000/-, రేటు 55 లక్షలు. ✆ 76720 94576
AJB- 132

LEASE (OR) RENT

➾ 2.75 Acres Comm Land Suitable for School or College or Warehouse, Off NH 205, 15 Mits from Tirupati. Cont : 9445253860
AJG-267409

TO-LET COMMERCIAL

» విజయవాడ BRTS రోడ్డ్ ఉత్తర ఫేసింగ్ 1st & 2nd ఫ్లోర్, 3620 sft. ఆఫీసులకు, బ్యాంక్‌లకు అద్దెకు ఇవ్వబడును. సంప్ర : సెల్ : 93999 96959, 93934 75164
AJB-259811

WANTED

» Kotak నూతన బ్యాంక్ నందు పనిచేయుటకు Rretired. VRS teachers మరియు గృహిణులు కావలెను. అర్హత: SSC To PG. సంప్రదించండి: సెల్: 99660 13779
AJB-235792

★ ప్రముఖ బ్యాంకింగ్ / ఫైనాన్స్ సంస్థ నందు విజయవాడలో పనిచేయుటకు హౌస్ కీపింగ్ బాయ్స్ సిబ్బంది కావలెను. జీతం: 15-17వేలు వరకు, పని గంటలు : 8 గం. సంప్ర: 7396437166
AJH-776

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA. ✆ 99493 08940
AJB-235793

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 290/- ప్రతి అదనపు లైనుకు రూ. 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు
ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద,
గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777,
వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240,
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 635

వివాదాలకు దూరంగా ఉండండి

● రౌడీషీటర్లకు సీఐ గిరిబాబు కౌన్సెలింగ్

తిరువూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వివాదాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సీఐ గిరిబాబు సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏ సమస్య అయినా శాంతియుతంగా చర్చించుకుంటే, సత్వరం పరిష్కరించుకోవచ్చని, అనాలోచితంగా, క్షణికావేశంలో, వివాదాలకు దిగడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని సీఐ హెచ్చరించారు. రౌడీషీటర్లు ఏ చిన్న వివాదంలో భాగస్వాములైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తు అనుమతి లేకుండా కౌన్సెలింగ్‌కు గైర్హాజరయితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

రెడ్డిగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నేరావుపేట గ్రామంలోని శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు వెండి, బంగారు అభరణాలు అపహరించుకుపోయారు. ఆలయ అర్చకుడు కుందుర్తి రామచంద్ ఓ వివాహానికి వెళ్లి రాత్రి ఒంటి గంట సమయంలో వచ్చే సరికి ఆలయం తలుపులు తీసి ఉండటాన్ని గమనించాడు. లోపలకు వెళ్లి చూడగా తాళాలు పగులకొట్టి ఉన్నాయి. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్తులకు తెలియజేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా స్వామి అభరణాలు పోయినట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం క్లూస్ టీమ్స్‌ను రప్పించి విచారణ చేపట్టారు. మొత్తం నాలుగు కేజీల వెండి, 16 గ్రాముల బంగారు అభరణాలు చోరీ అయినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి శెట్టిపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. రెడ్డిగూడెం ఎస్సై శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజా దర్బార్

రెడ్డిగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.కె.వి.రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

ఖాళీ స్థలాలు..రోగాలకు నిలయాలు

● మురుగు నిల్వ కారణంగా దోమల విజృంభణ

● విష జ్వరాల బారిన పడుతున్న ప్రజలు

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి): ఇళ్లు కట్టుకుందామని స్థలాలు కొని వాటిల్లో గృహాలు కట్టుకోకుండా కొందరు ఏళ్ల తరబడి ఖాళీగా జాగాలను వదిలేస్తున్నారు. అలా వదిలేసిన అనేక ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉంటోంది. నీటి నిల్వతో భారీగా జమ్మి, ఇతర చెట్లు పెరిగిపోతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా స్థలాలను యజమానులు శుభ్రం చేయించుకోకపోవడం వల్ల సమస్య మరింత జటిలమవుతోంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగు నీరు బయటకు పోయే మార్గం లేక జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో చేరిన నీరు ఏళ్ల తరబడి నిల్వ ఉంటోంది. అలా మురుగుగా మారిన నీరు దోమలకు అవాసంగా మారుతోంది. దోమలు వృద్ధి చెంది పక్కనే ఉన్న ఇళ్లలోని జనాలపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా విషజ్వరాలు బారిన పడి జనం విలవిల్లాడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోక ముందే ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటున్న మురుగు నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలని కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలు వేడుకుంటున్నారు.



కొండపల్లి శివకృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్స్ పక్కనే ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన జమ్మి

మురుగు నిల్వ ప్రదేశాలు

కొండపల్లి మున్సిపాలిటీలో కొండపల్లిలో శివకృష్ణ థియేటర్ పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్స్ మధ్య ఉన్న ఖాళీ స్థలంలో భారీగా మురుగు నిల్వ ఉంటోంది.. కొండపల్లి రిజర్వు ఫారెస్టు కొండల్లో పడిన వర్షం నీరు, ఆ ప్రాంతంలో ఉన్న ఇళ్లలో వాడుకునే నీరు డ్రెయినేజీ ద్వారా వచ్చి దామెర్ల వారి వీధిలో ఉన్న మూడెకరాల ఖాళీ స్థలంలో నిల్వ ఉంటోంది. ఆ ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీటిలో కొందరు వారి గేదెలకు జున్ను గట్టి పెంచుకుంటున్నారు. కొండపల్లి ఖిల్లా ప్రాంతం నుంచి వచ్చే మురుగు మొత్తం ఇక్కడే ఆగిపోతోంది. మురుగు పూర్తిగా బయటకు పోయే మార్గం లేదు. ఇబ్రహీంపట్నంలో ఖాజీమాన్యం ప్రాంతం, ఆర్టీసీ కాలనీ, జాకీర్‌హుస్సేన్ కాలేజ్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉంటోంది.



దామెర్లవారి వీధిలోని ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

మా మామగారికి విష జ్వరం సోకింది



మా ఇళ్ల పక్కనే నిల్వ ఉండే మురుగు బయటకు పోయే మార్గం లేదు. ఆ మురుగులో పెరిగిన దోమల కాటు వల్ల మా మామయ్య లాల్ సాహెబ్‌కు ఈ మధ్యే విష జ్వరం సోకింది. పరీక్ష చేయిస్తే డెంగీ అని తేలింది. ఎలాగో బతికి బయటపడ్డారు. ఇంటిలి పాదీ, వీధిలోని వారు ప్రతి వర్షాకాలం విష జ్వరాల బారిన పడుతున్నాం. తక్షణం ఇక్కడి మురుగు సమస్యకు పరిష్కారం చూపాలి.

\- మౌలాబీ, గృహిణి, దామెర్ల వారి వీధి

పరిశీలించి పరిష్కరిస్తాం

ఖాళీ స్థలాలను పరిశీలించి మురుగు సమస్యను పరిష్కరిస్తాం. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చాం. ఇంకా ఇస్తాం. వారితో మాట్లాడి స్థలాలను మెరక చేయించుకునేలా చూస్తాం. దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. పారిశుధ్య మెరుగుదల పనులు సత్వరమే చేయిస్తాం.

\- బి.రమ్యకీర్తన, మున్సిపల్ కమిషనర్, కొండపల్లి





సందడిగా వనసమారాధనలు





తిరువూరు ఆర్యవైశ్య వన సమారాధనలో పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), విస్సన్నపేటలో ముదిరాజుల వనసమారాధనలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్

తిరువూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత, సేవాస్ఫూర్తి కలయిక కార్తీకవన సమారాధన కార్యక్రమం అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఆదివారం పట్టణంలోని మామిడి తోటల్లో వివిధ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య, కాపు సంఘాల వనసమారాధన కార్యక్రమాల్లో ఎంపీ కేశినేని చిన్ని, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శావల దేవదత్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎన్నికలకు ముందే ఆర్యవైశ్యులు టీడీపీకి మద్దతుగా నిలిచారని ఎంపీ అన్నారు. కాపు వనసమారాధానలో ఎంపీ మాట్లాడారు. వంగవీటి మోహనరంగా కాపు వర్గానికే నాయకుడు కాదని, పేదల పక్షాన నిలిచి వారి అభ్యున్నతికోసం శ్రమించిన నాయకుడని కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘంలో నాళ్లా శ్రావ్య రచించిన ది గర్ల్ బిటివీన్ లైన్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన గుడిమెట్ల రామనరసింహారావును సత్కరించారు. బ్రాహ్మణ, కమ్మ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

విస్సన్నపేట: మండలంలోని మామిడి తోటల్లో కార్తీక వనసమారాధనలు ఆదివారం సందడి వాతావరణంలో నిర్వహించారు. ముదిరాజులు, ఆర్యవైశ్యులు, రజకులు వన సమారాధనలు జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముదిరాజుల వనసమారాధనకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో ఉన్న 20 లక్షలమంది ముదిరాజులు ఏకమవ్వాలని, సమస్యల పరిష్కారానికి పోరాడాలని, రాజకీయాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. ముదిరాజులకు ఎమ్మెల్సీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

యాదవులకు టీడీపీలో సముచిత స్థానం



యాదవ వన సమారాధనలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

జి.కొండూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యాదవులకు టీడీపీలో సముచిత స్థానం ఉంటుందని, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి పల్లా శ్రీనివాసరావుకు ఇవ్వడమే అందుకు నిదర్శనమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కుంటముక్కలలోని ఓమామిడి తోటలో ఆదివారం మైలవరం నియోజకవర్గం శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఎంపీని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు సత్కరించారు. తన గెలుపులో యాదవ సామాజికవర్గం పాత్ర కీలకమైనదని ఎంపీ అన్నారు. టీడీపీకి వెన్నుదన్నుగా ఉంటున్న యాదవులకు పార్టీతో పాటు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పటాపంచల నరసింహారావు, నగుళ్ల నాంచారయ్య, విజయా విద్యా సంస్థల చైర్మన్ అర్జునరావు, పల్లా ఆదినారాయణ, గేదెల వెంకటేశ్వరరావు, తోకల సత్యనారాయణ, వరుగు వెంకటేశ్వరరావు, మేకపోతుల బుల్లాబ్బాయి పాల్గొన్నారు.



తమతో పాటు కోచింగ్ తీసుకుంటున్న హారికకు క్రికెట్ కిట్ అందజేస్తున్న ముగ్గురు చిన్నారులు

చిన్నారుల పెద్ద మనస్సు

● దాచుకున్న సొమ్ముతో పేద క్రీడాకారిణికి క్రికెట్ కిట్ బహూకరణ

ఇబ్రహీంపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమతో పాటు గుంటుపల్లిలోని స్కై క్రికెట్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటున్న మైలవరానికి చెందిన పేద క్రీడాకారిణి హారికకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ గన్‌మ్యాన్ ఎం.వేణు ముగ్గురు పిల్లలు సిద్ధార్థరాయ్, రిత్వికారాయ్, రిషికారాయ్‌లు క్రికెట్ కిట్ బహూకరించి పెద్ద మనసు చాటుకున్నారు. తమ కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.10 వేలతో కిట్‌ను కొని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవీంద్ర చౌదరి చేతుల మీదుగా బహూకరించారు. చిన్నారులను కోచ్ దాసు, అకాడమీ పెద్దలు, స్థానికులు అభినందించారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

గణపతిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

● నేడు అన్నదానం

ఇబ్రహీంపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి పారిశ్రామిక వాడ(ఐడీఏ)లోని గణపతిస్వామి ఆలయంలో ఈనెల 17న మహా సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తామని, అనంతరం మహా అన్న సమారాధన నిర్వహిస్తామని ఐలా కార్యదర్శి బి.కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

విస్సన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పుత్రేల, చంద్రుపట్ల గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. పుత్రేలలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,870, చంద్రుపట్లలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,450 స్వాధీనం చేసుకున్నట్లు పీఎస్సై ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు ఘన నివాళి





గంపలగూడెం, జి.కొండూరు గ్రంథాలయాల్లో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

గంపలగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ 58వ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పెనుగొలను, గంపలగూడెం గ్రంథాలయాల్లో గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాల సహాయకులు జోతిర్మయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను స్మరించుకుంటూ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి జి.కొండూరు శాఖా గ్రంథాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారిణి వి.విజయకృష్ణ, పెద్దలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను చిట్యాల పాఠశాల ఉపాధ్యాయుడు రాయల వినయకుమార్ వివరించారు. మత్తుపదార్థాల వినియోగం భవిష్యత్‌ను నాశనం చేస్తుందని వివరించారు. గ్రంథాలయ అధికారిణి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరువూరులో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

యూటీఎఫ్ మండల కార్యవర్గం



అధ్యక్ష, కార్యదర్శులు చంటిబాబు, మురళి

విస్సన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జడ్పీహైస్కూల్‌లో యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా చాట్ల చంటిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మురళి, కోశాధికారిగా కె.రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, అనురాధ, గౌరవాధ్యక్షుడిగా బీవీ రామారావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పి.రామకృష్ణారెడ్డి, కట్టా రవిబాబు, కె.చైతన్య ఏకగ్రీవం గా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలవాల సుందరయ్య, కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ, వీరకోటి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా కార్యదర్శిగా బల్యా



జిల్లా కార్యదర్శిగా ఎంపికయిన బల్యా

విస్సన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ)జిల్లా కార్యదర్శిగా చంద్రుపట్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గుగులోతు బల్యా ఎంపికైనట్లు మండల శాఖ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులుగా వి.ఆంజనేయులు, జిల్లా కౌన్సిలర్‌గా ఎస్.రామకోటయ్య నియమితులైనట్లు ఆయన తెలిపారు. ఎంపికయిన వారిని యూనియన్ నాయకులు అభినందించారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

గంపలగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొలను గ్రంథాలయంలో ఆదివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలో స్వేచ్ఛాయుత, బాధ్యతాయుత పత్రికల్ని గౌరవించుకునేందుకే జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ పత్రికల్ని చేతపట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ



కొత్తూరులో దుస్తులు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

విజయవాడ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతవర్ష జన్మదినోత్సవం సందర్భంగా కొత్తూరు గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 29 మంది వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన భక్తులు గ్రామంలో స్వామి పల్లకీసేవ నిర్వహించారు. సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, సమితి కన్వీనర్ నరసింహారావు, సభ్యులు గుప్తా, రామకృష్ణ ప్రసాద్, తులసీరావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE



» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-259777

PLOT FOR SALE

» విజయవాడ గొల్లపూడి, కంచికచర్ల, పరిటాల ఇబ్రహీంపట్నం, గన్నవరం పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన వారు సంప్రదించండి. : 93947 17262
AJB-259763

స్థలం అమ్మకం

» విజయవాడ, ఏలూరు రోడ్డును అనుకొని SRR కాలేజి ప్రక్కన 480 చ.గ. స్థలం, పడమర ఫేస్ అమ్మకమునకు కలదు. సంప్ర సెల్ : 93999 96959, 93934 75164
AJB-259810

TO-LET COMMERCIAL

» విజయవాడ BRTS రోడ్ ఉత్తర ఫేసింగ్ 1st & 2nd ఫ్లోర్, 3620 sft. ఆఫీసులకు, బ్యాంక్‌లకు అద్దెకు ఇవ్వబడును. సంప్ర : సెల్ : 93999 96959, 93934 75164
AJB-259811

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA ✆ 99493 08940
AJB-235793

CHANGE OF SURNAME

» I, YARLAGADDA ARUNA KATYAYANI (Old Surname), W/o.Yarlagadda Bala Subrahmanyam, R/o.D.No.14-352A, Edepalli, Machilipatnam-521001, Krishna District, A. P, India. I have Changed My SURNAME As CHITTURI ARUNA KATYAYANI (New Surname). Here After My Surname Is Known As CHITTURI ARUNA KATYAYANI For All Purposes.
AJB-1579

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ. 220/- ప్రతి అదనపు లైనుకు రూ. 45/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464, తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
మైలవరం : 99854 85777, 99854 09286
నూజివీడు : 99854 02464, నందిగామ : 99854 11620
తిరువూరు : 98498 25565, జగ్గయ్యపేట : 8919466168

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 85777, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.635

రుద్రభూమి శివాలయంలో లక్ష బిల్వార్చన



జగ్గయ్యపేట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రుద్రభూమిలో వేంచేసియున్న శ్రీపార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం శ్రీస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, శివ కల్యాణం అర్చకులు, వేద పండితులు రెంట చింతల మహేశ్వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంత రం కార్తీకమాస ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

అబ్బురపరిచిన హిమాంసి చౌదరి
నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న కాట్రగడ్డ హిమాంసిచౌదరి

- నాట్యంతో కనువిందు
- దేశ విదేశాల్లో నృత్య ప్రదర్శనలు

నందిగామ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అందం, అభినయం, నృత్యం, ఆధ్యాత్మికం, మానవీయం కలబోసిన కళాకారిణి కాట్రగడ్డ హిమాంసి చౌదరి. నాట్యంతో కనువిందు చేస్తూనే, హావ భావాలతో అందరినీ ఆకట్టుకొనే మేటి నర్తకి హిమాంసి. కూచిపూడి నృత్యంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన హిమాంసి దేశ, విదేశాలలో కూచిపూడి నృత్యానికి వన్నె తీసుకు వచ్చారు. వరంగల్‌కు చెందిన కాట్రగడ్డ హిమాంసి ఆదివారం నందిగామలో నృత్య ప్రదర్శన ఇచ్చారు. వేలాదిగా హాజరైన ప్రజలు ఆ యువతి చేసిన ప్రదర్శనకు ముగ్ధులయ్యారు. అమెరికాలోని తానా, ఆటా తదితర తెలుగు సంస్థలు నిర్వహించే కార్యక్రమంలో నృత్యాలు చేసి కళాభిమానుల మన్ననలు పొందారు. మహారాష్ట్ర కజరహో ఆలయాల వద్ద నిర్వహించే ప్రతిష్ఠాత్మక నృత్య పోటీలలో రాణించి బహుమతులు పొందారు. వారణాసిలో జరిగిన గంగా మహా కుంభమేళా, గంగా ఉత్సవాలలో ప్రదర్శన ఇచ్చారు. చిదంబరం, అయోధ్య వంటి ప్రతిష్ఠాత్మక ఆధ్యాత్మిక ఆలయాల వద్ద హిమాంసి తన నృత్యాలతో అలరించారు. 2023 రిపబ్లిక్ డే పరేడ్‌లో రాష్ట్రపతి, ప్రధానిల ముందు నృత్యం చేసి ప్రశంసలు పొందారు.



ప్రశంసాపత్రాలు, మెడల్స్, ట్రోఫీ అందుకున్న చెస్ ప్లేయర్స్‌తో పారిశ్రామికవేత్త నర్సిరెడ్డి తదితరులు

చెస్ టోర్నీ విజేతలకు బహుమతుల పంపిణీ

జగ్గయ్యపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ చెస్ ఆకాడమి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జీవీజే బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరిగింది. చెస్ కోచ్ మహేష్ పర్యవేక్షణలో వివిధ కేటగిరిల్లో నిర్వహించిన పోటీల్లో 30 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలను, పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకంగా మెడల్స్, సర్టిఫికెట్లను ప్రముఖ పారిశ్రామికవేత్త ముల్లంగి నర్సిరెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.వి.నాగేశ్వరరావు, బ్యాడ్మింటన్ కోచ్ కీసర గోపీ, ఆకాడమి డైరెక్టర్ బి.రవికిరణ్, ఆకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న డీసీపీ లక్ష్మీనారాయణ తదితరులు

సత్ప్రవర్తనతో మెలగండి : రూరల్ డీసీపీ

జగ్గయ్యపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్ప్రవర్తనతో సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని విజయవాడ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లు, అను మానితులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచి వారుగా జీవించాలని కోరారు. అం తకు ముందు ఆయన రైల్వే కట్టసమీపంలో ఉన్న శ్రీనాగలక్ష్మీ అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించారు. అక్కడ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు భారీగా భక్తులు తరలివస్తే తీసుకోవాల్సిన చర్యలపై ప్రైవేట్ ఇంప్రూవ్‌మెంట్ కమిటీ సభ్యులతో చర్చించి, తగు సూచనలు ఇచ్చారు. ఎస్సై జి.రాజు ఆయనతో ఉన్నారు.

సీతారామాంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

నందిగామ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నందిగామ సీతా రామాంజ నేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆలయ అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షాచార్యులు, దన్వంతరీ ఆచార్యులు ఆధ్వ ర్యంలో మూడు రోజులు ఉత్సవాలు సాగుతున్నాయి. ఆదివారం విశ్వక్సేణారాధన, పుణ్యాహవాచనం, కుంభారాధన, శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల ఉత్సవమూర్తులకు తిరువంజనం, మహా శాంతిహోమం, గ్రామోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్య క్రమాలలో భక్తులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

ఉల్లాసంగా కార్తీక వనసమారాధన



మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం

సందడి సందడిగా ...



నందిగామలో పేద కమ్మ విద్యార్థులకు కమ్మ సంఘం తరఫున ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



జగ్గయ్యపేటలో వన సమారాధనకు హాజరైన తాత్వికులు గెంటేల వెంకట రమణ, ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

నందిగామ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనాథలైన ముగ్గురు విద్యార్థులను మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అక్కున చేర్చుకున్నారు. ఆదివారం నందిగామ కమ్మ సంఘ వన సమారాధన ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, తొండపు దశరథ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే బొద్దులూరి రామారావు, పలువురు కమ్మ ప్రముఖులు హాజరయ్యారు.

నందిగామ ప్రాంతంలో ఆరుగురు విద్యార్థులు అనాధలుగా ఉన్నట్లు గుర్తించిన కమ్మ సంఘం విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన వసంత తన సంస్థల ద్వారా ముగ్గురు విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తానని, వారు జీవితంలో స్థిరపడే వరకూ బాధ్యత తీసుకుంటానని చెప్పారు. కుల సంఘాలు సమాజ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. అనంతరం 135 మంది విద్యార్థులకు 13. 50 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

● **జగ్గయ్యపేట రూరల్ :** భారతదేశ సంస్కృతిలో అనాదిగా వన సమారాధనల పరంపర కొనసాగుతుందని కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. ఆదివారం కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మానవుడు భూమి మీద స్థిర నివాసం ఏర్పరచుకున్న నాటి నుంచే మానవ మనుగడలో ఉన్న అన్ని జాతులు వన సమారాధనలు నిర్వహించుకుంటున్నా యన్నారు. దానిలో భాగంగానే కమ్మ సామాజిక వర్గం తమ ఉనికిని కాపాడుకుంటూ సమాజానికి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తూ జాతిని పరిరక్షిస్తూ వస్తున్నారని తెలిపారు. ఎందరో మహానుభావులు దేశం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ మాట్లాడుతూ కమ్మ జాతి జీవిత చరిత్ర ప్రతి ఒక్కరూ చదువుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో కేసీపీ వైస్ ప్రెసిడెంట్ మదు సూధనరావు, నెట్టెం శివరాం, ఇంటూరి రంగనాయకులు, దూళిపాళ్ల లక్ష్మణరావు, కనపర్తి వెంకటేశ్వరరావు, తన్నీరు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో..

● **పెనుగంచిప్రోలు :** కార్తీక వన సమారాధన వేడుకలను ఆఖరి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున కార్తీక వన సమారాధన వేడుకలను నిర్వహించారు. పడమర బజారున వేంచేసి ఉన్న జమ్మిచెట్టు శ్రీ కోదండ రామాలయం భక్తుల ఆధ్వర్యంలో మునేటి అవతల వైపున గల ఆర్యవైశ్య ప్రముఖుడు దివ్య రాజేశ్వరరావు మామిడి వనంలో వన సమారాధన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. అనంతరం సాముహికంగా వన భోజనాలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు.

● **నందిగామ రూరల్ :** మండలంలోని పల్లగిరి గ్రామ సమీపంలోని చల్లా సంగమేశ్వరరావు మామిడి తోటలో బాలభక్త సమాజం ఆధ్వర్యంలో 105వ కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతంతో పాటు అన్నపూర్ణ సేవ, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు, చిన్నారులు ఉల్లాసంగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

● **జగ్గయ్యపేట :** పట్టణంలో బలుసుపాడు రోడ్డులో అనఘా వెంచర్స్ మామిడి తోటలో ఆదివారం ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన ఉత్సాహంగా జరిగింది. వనసమారాధనకు ముఖ్య అతిథిగా హాజరైన తాత్వికులు, బలుసుపాడు శ్రీ గురుధామ్ వ్యవస్థాపకులు గెంటేల వెంకట రమణ దంపతుల వన సమారాధన అంటే సమాధరణ అని, అందరిని సమానంగా ఆదరించటమేనన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ వైస్‌చైర్మన్ నూకల కుమార్‌రాజా, నియోజకవర్గ టీడీపీ యువ నేతలు శ్రీరాం చినబాబు, శ్రీరాం సాయిప్రసాద్ తదితరులు హాజరయ్యారు. తొలుత ఆర్యవైశ్య కుటుంబాల వారు సామూహికంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

కాపు వన సమారాధన

పట్టణంలో ఆటోనగర్‌లో పద్మనాభుని గార్డెన్స్‌లో కాపు వనసమారాధన ఆదివారం ఉల్లాసంగా జరిగింది. సమారాధనకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, స్టేట్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, విమలాభాను పౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను. వంగవీటి నరేంద్రలు హాజరై సందేశాలు ఇచ్చారు.





నాగలక్ష్మీ అమ్మవారికి
గాజులతో అలంకరణ



జగ్గయ్యపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యా నగర్ రైల్వే కట్ట సమీపంలో ఉన్న శ్రీస్వయంభూ నాగలక్ష్మీ అమ్మ వారి దేవ స్థానం 37వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం లక్ష గాజులతో అమ్మవారికి అలంకారం చేశారు. దేవస్థాన ఆవరణలో లక్ష్మీ గణపతి, చండీహోమాలు నిర్వహించారు. ప్రైవేట్ ఇంప్రూవ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో కవి సమ్మేళనం

జగ్గయ్యపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పదవీ విరమణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అబ్బాస్ అలీ, కవులు వడ్డేపల్లి శ్రీనివాసరావు, సరికొండ నరసింహరాజు, బత్తుల బ్రహ్మయ్య, అద్దంకి సుధాకర్, పర్సా శ్రీనివాసరావు, పి.రమణారావు, కొండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొనగా, గ్రంథాలయాధికారి మస్తాన్‌వలీ పర్యవేక్షించారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

నందిగామ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నందిగామ మార్కెట్ యార్డులో సోమవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపడుతున్నట్లు యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. రైతులు తమ పత్తిని యార్డుకు తరలించి మంచి ధర పొందాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి



తుమ్మా బుచ్చిబాబు (ఫైల్‌ఫొటో)

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ రోడ్డులో శనివారం అర్ధరాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో జగ్గయ్యపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ తుమ్మా బుచ్చిబాబు (35) మృతి చెందినట్లు చిల్లకల్లు ఎస్సై తోట సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు. బూదవాడలో జరిగిన ప్రైవేట్ కార్యక్రమంలో ఫొటోలు తీసి తిరిగి బైకుపై జగ్గయ్యపేటకు వస్తుండగా ఎదురుగా నిర్లక్ష్యంగా, వేగంగా వస్తున్న మరో బైకు ఢీకొనటంతో బుచ్చిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ప్రేమ పేరుతో వంచన

కంచికచర్లరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి గర్భవతిని చేసిన దురాగతం మండల కేంద్రమైన కంచికచర్లలో చోటుచేసుకుంది. కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్ అందించిన వివరాల మేరకు కంచికచర్లకు చెందిన (17) సంవత్సరాలు మైనర్ బాలికపై కంచికచర్ల ఇందిర కాలనీకి చెందిన ఉప్పతల శ్రీనివాస్ (19) అనే యువకుడు గత కొంత కాలంగా ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. ఇటీవల బాలిక కడుపునొప్పితో బాధపడుతూ తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వైద్య పరీక్షలు చేయించగా అసలు విషయం బయటపడింది. ఈ విషయమై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. నందిగామ ఏసీపీ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కారులో చెలరేగిన మంటలు

- తప్పిన పెను ప్రమాదం

కంచికచర్లరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంచికచర్ల మండలం కీసర సమీపంలో ప్రమాదానికి గురైన కారులో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడకు వృద్ధ దంపతులు ఇరువురు కారులో వస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కీసర టోల్‌గేట్ దాటి 200 మీటర్లు వచ్చేసరికి కారు టైరు బరస్ట్ అయి ముందు వెళ్లున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి ముందున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి, రోడ్డు పక్క గోతులోకి దూసుకుపోవడంతో ఒక్కసారిగా కారు ఇంజన్‌లో పొగలు కమ్మి మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన టోల్‌గేట్ సిబ్బంది అక్కడకు వచ్చి, కారులో ఉన్న దంపతులను బయటకు తీసి రక్షించారు. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది కారులోని మంటలను అదుపు చేశారు.

ముచ్చింతల - పెనుగంచిప్రోలు రహదారి అధ్వానం

- ప్రయాణికులకు నిత్యం నరకమే
- పట్టించుకోని అధికారులు



రాళ్లు లేచిపోయి అధ్వానంగా ముచ్చింతల - పెనుగంచిప్రోలు రహదారి

(పెనుగంచిప్రోలు, ఆంధ్రజ్యోతి) మండలంలోని ముచ్చింతల పెనుగంచిప్రోలు రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ముచ్చింతల నుంచి పెనుగంచిప్రోలు వచ్చే రహదారి శృతి ఫంక్షన్ హాల్ సెంటర్ వరకు రోడ్డు చాలా మేరకు కొట్టుకుపోయింది. రాళ్లు లేచాయి. పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణించే ప్రయాణికులకు నిత్యం నరకం కనబడుతోంది. ఈ రహదారి గుండా వత్సవాయి మండలంలోని ఖమ్మంపాడు, కాకరవాయి, మాచినేనిపాలెం తాళ్లూరు గ్రామాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని మధిర, సత్తుపల్లి, కల్లూరు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు నిత్యం పలు వాహనాల్లో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి పెనుగంచి ప్రోలుకు వస్తుంటారు. ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో ఇటువైపుగా వచ్చే ప్రజలు, భక్తులు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని స్పందించక పోవడంపై ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కావున ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారిపై కనీసం గ్రావెల్తోనైనా గుంతలను సరిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE



» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-259777

PLOT FOR SALE

» విజయవాడ గొల్లపూడి, కంచికచర్ల, పరిటాల ఇబ్రహీంపట్నం, గన్నవరం పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన వారు సంప్రదించండి. : 93947 17262
AJB-259763

స్థలం అమ్మకం

» విజయవాడ, ఏలూరు రోడ్డును ఆనుకొని SRR కాలేజి ప్రక్కన 480 చ.గ స్థలం, పడమర ఫేస్ అమ్మకమునకు కలదు. సంప్ర సెల్ : 93999 96959, 93934 75164
AJB-259810

TO-LET COMMERCIAL

» విజయవాడ BRTS రోడ్ ఉత్తర ఫేసింగ్ 1st & 2nd ఫ్లోర్, 3620 sft. ఆఫీసులకు, బ్యాంక్‌లకు అద్దెకు ఇవ్వబడును. సంప్ర : సెల్ : 93999 96959, 93934 75164
AJB-259811

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA. ✆ 99493 08940
AJB-235793

CHANGE OF SURNAME

» I, YARLAGADDA ARUNA KATYAYANI (Old Surname), W/o.Yarlagadda Bala Subrahmanyam, R/o.D.No.14-352A, Edepalli, Machilipatnam-521001, Krishna District, A. P, India. I have Changed My SURNAME As CHITTURI ARUNA KATYAYANI (New Surname). Here After My Surname Is Known As CHITTURI ARUNA KATYAYANI For All Purposes.
AJB-1579

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మింపబడిన క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

GST 5%

REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT

రూ. 220/- కలర్ 30% EXTRA

మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609

మైలవరం : 99854 85777, 99854 09286
నూజివీడు : 99854 02464, నందిగామ : 99854 11620
తిరువూరు : 98498 25565, జగ్గయ్యపేట : 8919466168

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 85777, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234